www.udyamakeratam.com

PRGI No. : TGTEL/25/A0273

1 వ వార్షికోత్సవం

# ఉద్యమ కెరటం

నిజం రక్షతి రక్షిత:

UDYAMA KERATAM TELUGU DAILY

తెలుగు దినపత్రిక

| ఆసిఫాబాద్ | | సంపుటి: 2 | | సంచిక: 105 | | 2-10-2026 | | శుక్రవారం | | పేజీలు: 8 | | వెల : రూ.2/-

## అన్ని నిర్ణయాలు ఏకగ్రీవమే



- ఎన్నికల సంఘంలో అంతర్గత విభేదాల వార్తలపై ఈసీ క్లారిటీ!
- 'సర్' ప్రక్రియపై ప్రతిపక్షాల ఆరోపణలను తిరస్కరించిన ఎన్నికల కమిషన్

..4లో

## జైల్లో పెట్టినా పోరాటం ఆగదు



- సీఈసీ జ్ఞానేష్‌కుమార్ రాజీనామా కోరుతూ సీజేపీ ఉద్యమ పిలుపు
- అక్టోబర్ 2న ముంబై శివాజీ పార్క్‌లో 'జైల్ భరో ఆందోళన్'
- అనుమతి నిరాకరించినా వెనక్కి తగ్గబోమన్న అభిజీత్ దీప్కే

4

## మై-బాప్ సర్కార్ కాదు.. పౌరుడే ప్రధానం



- యూపీఎస్సీ శతాబ్ది వేడుకల్లో ప్రధాని మోదీ కీలక సందేశం
- 'దేశం ముందు.. పౌరుడు ముందు' అనే రెండు ప్రమాణాలే కీలకమని స్పష్టీకరణ

4




## ఖైరతాబాద్ ఉప ఎన్నికకు తాత్కాలిక బ్రేక్

- తెలంగాణ హైకోర్టుకు వెల్లడించిన ఈసీఐ!
- విజయారెడ్డి పిటిషన్‌పై తుది తీర్పు వచ్చే వరకు నోటిఫికేషన్ ఇవ్వబోమన్న భారత ఎన్నికల సంఘం
- దానం నాగేందర్ అనర్హతతో ఖాళీ అయిన స్థానం..
- కోర్టు తీర్పుపైనే ఉప ఎన్నిక భవితవ్యం

4

### 20 వేల ఓట్లు వెంటనే చేర్చాలి



- దానం నాగేందర్
- ఖైరతాబాద్‌లో ఓట్ల తొలగింపుపై మాజీ మంత్రి తీవ్ర ఆగ్రహం
- తొలగించిన ఓట్లను అదనపు జాబితాలో చేర్చాలని డిమాండ్

3

# ఉద్యోగులకు దసరా కానుక

## రెండు డీఏలకు కేబినెట్ ఓకే!

2024 నుంచి పెండింగ్‌లో ఉన్న రెండు డీఏల మంజూరుకు ఆమోదం

పెన్షనర్లకు రెండు డీఆర్‌లు.. బకాయిలు వాయిదాల్లో చెల్లింపు

ప్రభుత్వ ఖజానాపై ఏటా రూ.2,500 కోట్ల అదనపు భారం

- 235 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు.. త్వరలో అఖిలపక్ష సమావేశం
- విద్యుత్ డిమాండ్ రికార్డు స్థాయికి.. కొత్త విద్యుత్ ప్రాజెక్టులకు పచ్చజెండా



సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో గురువారం జరిగిన మంత్రిమండలి సమావేశం పలు కీలక నిర్ణయాలకు ఆమోదముద్ర వేసింది. ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకు 2024 నుంచి బకాయి ఉన్న డీఏల్లో రెండు డియర్‌నెస్ అలవెన్స్ (డీఏ/డీఆర్)లను మంజూరు చేయడానికి కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎరియర్స్‌ను వాయిదాల్లో చెల్లించనున్నారు. తీవ్ర ఆర్థిక భారం ఉన్నప్పటికీ ఉద్యోగ సంఘాలకు ఇచ్చిన హామీకి కట్టుబడి సీఎం రేవంత్ రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నారని, దీనివల్ల ప్రభుత్వంపై ఏటా రూ.2,500 కోట్లదనపు భారం పడుతుందని మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వెల్లడించారు.

**హైదరాబాద్, అక్టోబర్ 1 (ఉద్యమ కెరటం):** తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. 2024 నుంచి పెండింగ్‌లో ఉన్న కరవు భత్యాల్లో రెండు డీఏలను ప్రభుత్వ ఉద్యోగులకు, రెండు డీఆర్‌లను పెన్షనర్లకు మంజూరు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన గురువారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఆమోదం తెలిపింది. సంబంధిత బకాయిలను వాయిదాల్లో చెల్లించాలని నిర్ణయించింది. ఈ నిర్ణయంతో రాష్ట్ర ఖజానాపై ఏటా సుమారు రూ.2,500 కోట్ల అదనపు భారం పడనున్నట్లు రెవెన్యూ

మిగతా 2 లో



## విద్యుత్ రంగంలో మరింత అభివృద్ధి

పాలేరు నియోజకవర్గానికి రూ.205కోట్ల నిధులు

రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

పాలేరు నియోజకవర్గంలో విద్యుత్ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు గత 34 నెలల్లో రూ. 205 కోట్ల నిధులు మంజూరు చేసి వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు.

2

## హైదరాబాద్ పోలీస్ పరిధిలో భారీ మార్పులు




- సిటీ పోలీస్ పరిధిలో 76 ప్రాంతాల సరిహద్దుల పునర్వ్యవస్థీకరణ
- జోన్లు, డివిజన్లు, పోలీస్ స్టేషన్ల పరిధుల్లో మార్పులు
- ఆర్‌జీఐఏ పీఎస్ పేరు 'శంషాబాద్ పీఎస్'గా మార్పు
- ట్రాఫిక్, ఉమెన్ సేఫ్టీ, జోనల్ సైబర్ సెల్‌ల పరిధులకూ కొత్త రూపం

2

## రేవంత్ పులి కాదు చంద్రబాబు పిల్లి!

అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్న కేటీఆర్

3

'మీ ఆస్తులు.. మా ఆస్తులు.. సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధమా?' అంటూ సవాల్





## 24 గంటల కరెంట్ హామీ ఏమైంది?

- మన రైతుల పంటలు ఎండుతుంటే.. రాజస్థాన్‌కు విద్యుత్ అమ్ముకుంటారా?
- కనీసం 7, 8 గంటలు కూడా ఇవ్వలేకపోతోంది..
- లో వోల్టేజ్ తో మోటార్లు, ట్రాన్స్ ఫార్మర్లు కాలిపోతున్నాయి..
- కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ధ్వజం

3

## అక్టోబర్‌లోనూ ఎండలే!

- తెలంగాణలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం
- ఈ నెలలో గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే అధికంగా ఉండే సూచనలు
- ఎల్‌నినో ప్రభావంతో వాతావరణంలో మార్పులు
- అక్టోబర్-డిసెంబర్‌లోనూ తక్కువ వర్షపాతమే ఉండొచ్చన్న ఐఎండీ
- ఈశాన్య రుతుపవనాల సమయంలో తటస్థ ఐఓడీ పరిస్థితులు కొనసాగే అవకాశం

2



తెలంగాణలో అక్టోబర్ నెలలోనూ వర్షాలు ఆశించిన స్థాయిలో కురిసే అవకాశం లేదని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. నెలవారీ వాతావరణ అంచనాలను విడుదల చేసిన ఐఎండీ.. రాష్ట్రంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలున్నట్లు తెలిపింది.




## 'క్యూర్'తో హైదరాబాద్ పాలనలో కొత్త శకం

- నేటి నుంచి అధికారికంగా అమల్లోకి 'క్యూర్' చట్టం
- 1955 జీహెచ్ఎంసీ యాక్ట్‌కు బదులుగా కొత్త చట్టం
- క్యాపిటల్ వాల్యూ ఆధారంగా ఆస్తిపన్ను లెక్కింపు
- ఆస్తి, నీరు, సీవరేజ్, శానిటేషన్ సేవలకు ఇంటిగ్రేటెడ్ బిల్లింగ్
- హైడ్రాకు చట్టబద్ధ హోదాతో ఆక్రమణలపై మరిన్ని అధికారాలు

2

ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
శుక్రవారం
2 అక్టోబర్ 2026




# ఖైరతాబాద్ ఉప ఎన్నికకు తాత్కాలిక బ్రేక్

**తెలంగాణ హైకోర్టుకు వెల్లడించిన ఈసీఐ!**

**విజయారెడ్డి పిటిషన్‌పై తుది తీర్పు వచ్చే వరకు నోటిఫికేషన్ ఇవ్వబోమన్న భారత ఎన్నికల సంఘం**

**హైదరాబాద్, అక్టోబర్ 1 (ఉద్యమ కెరటం):** హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక నిర్వహణపై భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) కీలక ప్రకటన చేసింది. కాంగ్రెస్ నేత పి. విజయారెడ్డి దాఖలు చేసిన ఎన్నికల పిటిషన్‌పై తుది పరిష్కారం లభించే వరకు ఉప ఎన్నిక నోటిఫికేషన్ జారీ చేయబోమని తెలంగాణ హైకోర్టుకు స్పష్టం చేసింది. దీంతో ఈ నియోజకవర్గంలో ఉప ఎన్నికల ప్రక్రియకు తాత్కాలికంగా బ్రేక్ పడగా, న్యాయస్థానంలో విచారణ పూర్తయ్యే వరకు రాజకీయ అనిశ్చితి నెలకొంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున గెలిచి, అనంతరం కాంగ్రెస్‌లో చేరిన దానం నాగేందర్‌పై అనర్హత వేటు పడటంతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లు అసెంబ్లీ కార్యదర్శి అధికారిక గెజిట్ విడుదల చేశారు. నిబంధనల ప్రకారం స్థానం ఖాళీ ఏర్పడిన ఆరు నెలల్లో ఉప ఎన్నిక నిర్వహించాల్సి ఉండటంతో రాష్ట్ర ఎన్నికల యంత్రాంగం నివేదికను కేంద్ర ఎన్నికల సంఘానికి పంపించింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో దానం నాగేందర్ ఎన్నికల అఫిడవిట్‌లో ఫారం-26కు సంబంధించిన వివరాలను సరిగ్గా వెల్లడించలేదంటూ కాంగ్రెస్ నేత పి. విజయారెడ్డి దాఖలు చేసిన పిటిషన్ ప్రస్తుతం హైకోర్టులో పెండింగ్‌లో ఉంది. నాగేందర్ అనర్హతకు గురైన నేపథ్యంలో, తన పిటిషన్‌పై తుది తీర్పు వెలువడే వరకు ఉప ఎన్నిక నోటిఫికేషన్ జారీ చేయకుండా ఆదేశించాలని ఆమె కోరారు. ఈ పిటిషన్‌పై స్పందించిన ఎన్నికల సంఘం, కోర్టులో విచారణ తేలే వరకు నోటిఫికేషన్ ఇవ్వబోమని క్లారిటీ ఇచ్చింది. హైకోర్టు వెలువరించే తదుపరి ఆదేశాల ఆధారంగానే ఖైరతాబాద్ ఉప ఎన్నికల భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది.

# ఇన్ సర్వీస్ టీచర్లకు టీజీ టెట్-2026-2

**ప్రత్యేక టెట్ నోటిఫికేషన్ విడుదల చేసిన పాఠశాల విద్యాశాఖ**

**అక్టోబర్ 7 నుంచి 16 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ**

**ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల ఉపాధ్యాయులకు అవకాశం**

**గురుకులాలు, మోడల్ స్కూళ్ల టీచర్లకు కూడా అర్హత**

**నవంబర్ 16 నుంచి 21 వరకు కంప్యూటర్ ఆధారిత పరీక్షలు**

**హైదరాబాద్, అక్టోబర్ 1 (ఉద్యమ కెరటం):** తెలంగాణలో పనిచేస్తున్న ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు పాఠశాల విద్యాశాఖ శుభవార్త అందించింది. విధుల్లో ఉన్న టీచర్ల కోసం ప్రత్యేకంగా టీజీ టెట్-2026-2 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ప్రభుత్వ పాఠశాలలు,స్థానిక సంస్థల పరిధిలోని బడులతో పాటు టీజీఆర్ఈఐఎస్, ప్రభుత్వ సంక్షేమ గురుకుల సొసైటీలు, తెలంగాణ మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇతర ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు కూడా ఈ ప్రత్యేక టెట్ రాసే అవకాశం కల్పించారు. టీజీ టెట్-2026-2కి ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ అక్టోబర్ 7న ప్రారంభం కానుంది. అర్హులైన ఉపాధ్యాయులు అక్టోబర్ 16 వరకు దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తు విధానం, అర్హతలు, పరీక్షకు సంబంధించిన ఇతర పూర్తి వివరాలను తెలంగాణ పాఠశాల విద్యాశాఖ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నట్లు అధికారులు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు నవంబర్ 16 నుంచి 21 వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) విధానంలో టెట్ నిర్వహించనున్నట్లు విద్యాశాఖ వెల్లడించింది. నిర్ణీత గడువులో అర్హులైన ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకుని సద్వినియోగం చేసుకోవాలని సూచించింది.

# 'క్యూర్'తో హైదరాబాద్ పాలనలో కొత్త శకం

**హైదరాబాద్, అక్టోబర్ 1 (ఉద్యమ కెరటం):** హైదరాబాద్ మహానగర పాలనలో కీలక మార్పులకు దారితీసే 'క్యూర్' చట్టం రేపటి నుంచి అమల్లోకి రానుంది. 1955 నాటి జీహెచ్ఎంసీ యాక్ట్ స్థానంలో తీసుకొచ్చిన ఈ చట్టంతో జీహెచ్ఎంసీ, సీఎమ్‌సీ, ఎమ్ఎమ్‌సీ పరిధులకు సమగ్ర పాలనా విధానం అమలులోకి రానుంది. విలీన ప్రాంతాల్లో కొనసాగుతున్న పన్నులు, పాలనా విధానాల్లోని వ్యత్యాసాలను తొలగించి మూడు కార్పొరేషన్లలోనూ ఒకే విధమైన నిబంధనలు అమలు చేయనున్నారు. భవన నిర్మాణ అనుమతులు, ఆస్తిపన్ను, ట్రేడ్ లైసెన్స్‌ల జారీలో ఏకీకృత విధానం అందుబాటులోకి రానుంది. క్యూర్ చట్టంతో ఆస్తిపన్ను విధానంలోనూ మార్పు రానుంది. ప్రస్తుతం ఉన్న రెంటల్ వాల్యూ విధానానికి బదులుగా ఆస్తి క్యాపిటల్ వాల్యూ ఆధారంగా పన్ను లెక్కించనున్నారు. కొత్త విధానం వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి అమలు చేయనుండటంతో ఆస్తిపన్ను పెరిగే అవకాశం ఉంది. ప్రతి ఆస్తికి ప్రత్యేక 'ఇంటిగ్రేటెడ్ ఐడెంటిటీ కోడ్' కేటాయించనున్నారు. ఆస్తిపన్ను, తాగునీరు, సీవరేజ్, శానిటేషన్ చార్జీలను ఒకే పోర్టల్ ద్వారా సమగ్ర బిల్లింగ్ విధానంలో అందించనున్నారు. ట్రాఫిక్, విపత్తుల నిర్వహణ కోసం ప్రత్యేక అథారిటీల ఏర్పాటుకూ చట్టంలో మార్గం కల్పించారు. చెరువులు, కుంటలు, నాలాలు, ప్రభుత్వ భూములు, ఇతర ప్రజా ఆస్తుల పరిరక్షణకు పనిచేస్తున్న హైడ్రాకు క్యూర్ చట్టం ద్వారా చట్టబద్ధ హోదా కల్పించనున్నారు. ఆక్రమణల నిరోధం, అక్రమ నిర్మాణాలపై చర్యలు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు హైడ్రాకు మరిన్ని చట్టపరమైన అధికారాలు అందనున్నాయి. దీంతో నగరంలోని పబ్లిక్ అసెట్స్ రక్షణలో హైడ్రా పాత్ర మరింత విస్తరించనుంది.

# ఉద్యోగులకు దసరా కానుక..

మొదటి పేజీ తరువాయి

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఉద్యోగ సంఘాలతో ఇటీవల జరిపిన చర్చల్లో ఇచ్చిన హామీ మేరకు ఆర్థికంగా భారం ఉన్నప్పటికీ రెండు డీఏలకు ఆమోదం తెలిపినట్లు ప్రభుత్వం పేర్కొంది. డీఏల అమలు తేదీలు, బకాయిల చెల్లింపు విధానం తదితర పూర్తి వివరాలు ఆర్థిక శాఖ ఉత్తర్వులతో మరింత స్పష్టమయ్యే అవకాశం ఉంది. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో నెలకొన్న పరిస్థితులపై మంత్రివర్గం సుదీర్ఘంగా చర్చించింది. రుతుపవనాల కాలం ముగిసే నాటికి రాష్ట్రంలో సాధారణం కంటే సుమారు 17 శాతం వర్షపాతం లోటు నమోదైందని, 235 మండలాల్లో వర్షాభావ ప్రభావం తీవ్రంగా ఉన్నట్లు అధికారులు కేబినెట్‌కు వివరించారు. ఈ ప్రాంతాల్లో చేపట్టాల్సిన చర్యలపై కేబినెట్ ఉపసంఘం సమగ్ర నివేదిక రూపొందించనుంది. అనంతరం అత్యవసర మంత్రివర్గ సమావేశం నిర్వహించి కార్యాచరణ ఖరారు చేయాలని నిర్ణయించారు. అంతకుముందు రాజకీయ పార్టీలు, రైతు సంఘాలు, నిపుణుల సూచనలు తీసుకునేందుకు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయనున్నారు. కేంద్రం నుంచి అవసరమైన సాయం కోరాలని కూడా మంత్రివర్గం నిర్ణయించింది. కేబినెట్ ఉపసంఘం నివేదిక ఆధారంగా కేంద్రానికి ప్రతిపాదనలు పంపడంతోపాటు రాష్ట్ర మంత్రుల బృందం ఢిల్లీ వెళ్లి పరిస్థితులను వివరించనుంది. ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని అధికారులను మంత్రివర్గం ఆదేశించింది. దాదాపు 65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉ



ంటుందని పౌరసరఫరాల శాఖ అంచనా వేసిన నేపథ్యంలో కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేసి, రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని సూచించింది.

**విద్యుత్ డిమాండ్ 19,892 మెగావాట్లు**

ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరిగినట్లు ప్రభుత్వం తెలిపింది. సాధారణంగా దాదాపు 15 వేల మెగావాట్ల స్థాయిలో ఉండే డిమాండ్ ఈ సీజన్‌లో గరిష్ఠంగా 19,892 మెగావాట్లకు చేరినట్లు మంత్రివర్గానికి అధికారులు వివరించారు. డిమాండ్‌కు తగ్గట్టుగా విద్యుత్‌ను సమకూర్చుకుని కోతలు లేకుండా సరఫరా చేయాలని కేబినెట్ నిర్ణయించింది. అవసరమైతే అదనపు విద్యుత్‌ను కొనుగోలు చేయాలని సూచించింది. భవిష్యత్ విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని 3 వేల మెగావాట్ల సౌర విద్యుత్, 4 వేల మెగావాట్ల బ్యాటరీ విద్యుత్ నిల్వ వ్యవస్థ, 800 మెగావాట్ల పవన విద్యుత్‌కు సంబంధించిన ప్రతిపాదనలపై మంత్రివర్గం చర్చించింది. కేంద్ర నిబంధనలకు అనుగుణంగా బిడ్డింగ్ విధానంలో ప్రాజెక్టులను చేపట్టాలని నిర్ణయించింది. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కోహెడలో ప్రపంచస్థాయి ప్రమాణాలతో సమీకృత పండ్ల మార్కెట్ ఏర్పాటును వేగవంతం చేయాలని కేబినెట్ నిర్ణయించింది. దీనికి సుమారు రూ.650 కోట్ల వ్యయం అంచనా వేసినట్లు తాజా వివరాలు చెబుతున్నాయి. దీర్ఘకాలంగా అసంపూర్తిగా ఉన్న పది ఈపీసీ సాగునీటి ప్రాజెక్టులను నిలిపివేయడానికి కూడా ఆమోదం తెలిపింది. తెలంగాణలో డిజిటల్ మీడియా ప్రకటనలకు ప్రత్యేక విధానాన్ని అమలు చేసే ప్రతిపాదనకు మంత్రివర్గం పచ్చజెండా ఊపింది. కేంద్ర ప్రభుత్వ డిజిటల్ ప్రకటనల విధానానికి అనుగుణంగా రాష్ట్ర విధానాన్ని రూపొందించినట్లు ప్రభుత్వం తెలిపింది. న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ పోస్టుతోపాటు మరో నలుగురు గ్రూప్-1 అధికారులను నియమించేందుకూ ఆమోదం తెలిపింది.

# విద్యుత్ రంగంలో మరింత అభివృద్ధి

**పాలేరు నియోజకవర్గానికి రూ.205కోట్ల నిధులు**

**రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**

**ఖమ్మం, అక్టోబర్ 1 (ఉద్యమ కెరటం):** పాలేరు నియోజకవర్గంలో విద్యుత్ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు గత 34 నెలల్లో రూ. 205 కోట్ల నిధులు మంజూరు చేసి వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. గురువారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని తరుణి హాట్‌లో కలెక్టర్ దివాకర టిఎస్, సిపి సునీల్ దత్ తో కలిసి డివిజన్ ఈఆర్ఓ కార్యాలయాన్ని మంత్రి ప్రా రంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొం గు లేటి మాట్లాడుతూ.. పాలేరు నియోజక వర్గంలో విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణం, హైటె న్షన్ విద్యుత్ వైర్ల మార్పిడి, కొత్త విద్యుత్ లై న్లు, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పా టు వంటి పనులకు రూ. 205 కోట్ల నిధులు కేటాయించినట్లు



తెలిపారు. చేపట్టిన పనుల్లో ఇప్పటికే 70 శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను కూడా వేగవంతంగా పూర్తి చేస్తున్నామన్నారు. ప్రతిపక్ష నాయకులు విద్యుత్ రంగంపై తప్పుడు ప్రచారం చేస్తు న్నారని మంత్రి అన్నారు. భద్రాద్రి, యాదాద్రి విద్యుత్ ప్రాజెక్టులు గత ప్రభుత్వ హయాంలో పూర్తి కాలేదని, తమ ప్రభుత్వం వాటిని పూర్తి చేసి విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించిందని తెలి పారు. గత ప్రభుత్వ హయాంలో ఒక మెగావాట్ విద్యుత్ ఉత్పత్తికి అధిక వ్యయం జరిగిన అంశాలను సరిదిద్దుతూ విద్యుత్ రం గంలో సంస్కరణలు చేపడుతున్నామని చెప్పా రు. తెలంగాణ విద్యుత్ రంగాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి తెలిపారు. భవిష్యత్ వి ద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని గ్రీన్ పవర్ ఉ త్పత్తికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీజీఎన్ పీడీసీఎల్ డైరెక్టర్ మధుసూదన్ రావు, వి ద్యుత్ శాఖ ఎస్ఇ శ్రీనివాసా చారి, ఆర్ అండ్ బి ఎస్ఇ యుగంధర్ రావు, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, ఎదులాపురం మునిసిపల్ కమీషనర్ ఏ. శ్రీని వాస రెడ్డి, మునిసిపల్ వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారు లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ పోలీస్ పరిధిలో భారీ మార్పులు

- సిటీ పోలీస్ పరిధిలో 76 ప్రాంతాల సరిహద్దుల పునర్వ్యవస్థీకరణ
- జోన్లు, డివిజన్లు, పోలీస్ స్టేషన్ల పరిధుల్లో మార్పులు
- ఆర్‌జీఐఏ పీఎస్ పేరు 'శంషాబాద్ పీఎస్'గా మార్పు
- ట్రాఫిక్, ఉమెన్ సేఫ్టీ, జోనల్ సైబర్ సెల్‌ల పరిధులకూ కొత్త రూపం
- నగర విస్తరణ, జనాభా పెరుగుదలకు అనుగుణంగా సర్కారు నిర్ణయం

**హైదరాబాద్, అక్టోబర్ 1 (ఉద్యమ కెరటం):** హైదరాబాద్ మహానగరంలో శాంతిభద్రతల నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టేందుకు పోలీస్ వ్యవస్థను ప్రభుత్వం పునర్వ్యవస్థీకరించింది. సిటీ పోలీస్ పరిధిలోని జోన్లు, డివిజన్లు, పోలీస్ స్టేషన్ల సరిహద్దుల్లో మార్పులు చేస్తూ హోం శాఖ జీవో ఎంఎస్ నంబర్ 84ను జారీ చేసింది. నగర విస్త రణ, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పోలీస్ పరి




పాలనను సరళీకరించడం, శాంతిభద్రతల పర్యవేక్షణను మెరుగుపరచడం ప్రధాన ఉద్దేశంగా ప్రభుత్వం పేర్కొంది.

**76 ప్రాంతాల పరిధుల్లో మార్పులు**

పునర్వ్యవస్థీకరణలో భాగంగా నగరంలోని 76 ప్రాంతాలకు సంబంధించిన పోలీస్ పరిధుల్లో మార్పులు చేశారు. పలు ప్రాంతాలను ప్రస్తుతం ఉన్న జోన్లు, డివిజన్ల నుంచి ఇతర పరిధులకు బదిలీ చేశారు. సికింద్రాబాద్ మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొన్ని ప్రాంతాలను మల్కాజిగిరి కమిషనరేట్‌కు బదిలీ చేయడంతో పాటు మహేశ్వరం, శంషాబాద్, సైబరాబాద్ పరిధుల్లోనూ మార్పులు చేశారు. శంషాబాద్ డివిజన్‌లోని ఆర్‌జీఐఏ పోలీస్ స్టేషన్ పేరును 'శంషాబాద్ పీఎస్'గా మార్చారు. రాజేంద్రనగర్, అబ్దుల్లాపూర్‌మెట్, మీర్‌పేట్‌తో పాటు జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, సనత్‌నగర్ ప్రాంతాల పోలీస్ సరిహద్దుల్లోనూ మార్పులు చోటుచేసుకున్నాయి.

**ప్రత్యేక విభాగాలకూ కొత్త పరిధులు**

లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్లతో పాటు ట్రాఫిక్, ఉమెన్ సేఫ్టీ, జోనల్ సైబర్ సెల్ విభాగాల పరిధులను కూడా ప్రభుత్వం పునర్వ్యవస్థీకరించింది. ట్రాఫిక్ నిర్వహణను మెరుగుపరిచేలా జోన్లు, డివిజన్లను కొత్తగా వర్గీకరించారు. మహిళల భద్రతకు సంబంధించిన సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు ఉమెన్ సేఫ్టీ వింగ్‌కు కొత్త జోన్లను కేటాయించారు. సైబర్ నేరాల కేసుల్లో వేగంగా స్పందించేలా జోనల్ సైబర్ సెల్‌ల పరిధులను కూడా సవరించారు. తాజా మార్పులతో పోలీస్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

# అక్టోబర్‌లోనూ ఎండలే!

- తెలంగాణలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం
- ఈ నెలలో గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే అధికంగా ఉండే సూచనలు
- అక్టోబర్-డిసెంబర్‌లోనూ తక్కువ వర్షపాతమే ఉండొచ్చన్న ఐఎండీ

**హైదరాబాద్, అక్టోబర్ 1 (ఉద్యమ కెరటం):** తెలంగాణలో అక్టోబర్ నెలలోనూ వర్షాలు ఆశించిన స్థాయిలో కురిసే అవకాశం లేదని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. నెలవారీ వాతావరణ అంచనాలను విడుదల చేసిన ఐఎండీ.. రాష్ట్రంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలున్నట్లు తెలిపింది.



సాధారణంగా అక్టోబర్‌లో వాతావరణం క్రమంగా చల్లబడాల్సి ఉండగా, ఈసారి అందుకు భిన్నంగా ఎండల తీవ్రత కొనసాగే అవకాశముందని పేర్కొంది. భూమధ్యరేఖా పసిఫిక్ మహాసముద్రంపై కొనసాగుతున్న బలమైన ఎల్‌నినో పరిస్థితులు వాతావరణంపై ప్రభావం చూపుతున్నట్లు ఐఎండీ తెలిపింది. ఈ పరిస్థితులు ఏడాది చివరి వరకు మరింత బలపడే అవకాశం ఉందని పేర్కొంది. మరోవైపు హిందూ మహాసముద్రంపై ప్రస్తుతం ఐఓడీ తటస్థ స్థితిలో ఉందని, రాబోయే ఈశాన్య రుతుపవనాల సమయంలోనూ ఇదే పరిస్థితి కొనసాగవచ్చని అంచనా వేసింది. అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు కొనసాగే సీజన్‌లో తెలంగాణలో మొత్తం వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. ఈ నెలలో రాష్ట్రవ్యాప్తంగా గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే ఎక్కువగా నమోదయ్యే అవకాశముందని తెలిపింది. దీంతో అక్టోబర్‌లోనూ వేడి వాతావరణం కొనసాగవచ్చని పేర్కొంది.

# రేవంత్ పులి కాదు.. చంద్రబాబు పిల్లి!

- అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్న కేటీఆర్
- 'మీ ఆస్తులు.. మా ఆస్తులు.. సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధమా?' అంటూ సవాల్
- యూరియా కొరత.. కరెంట్ సరఫరాపై ప్రభుత్వాన్ని నిలదీసిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్
- కాళేశ్వరం, విద్యుత్ కొనుగోళ్లు, ఫార్ములా-ఈ విచారణల్లో ఏం తేలిందని ప్రశ్న
- చేనేత కార్మికులు, ఎన్నికల హామీలపైనా ప్రభుత్వంపై విమర్శలు



**హైదరాబాద్, అక్టోబర్ 1 (ఉద్యమ కెరటం):** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రైతులు, చేనేత కార్మికులు, యువత, బీసీలు, దళితులు, మైనారిటీలు సహా అన్ని వర్గాలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేదని ఆరోపించారు. తన కుటుంబ ఆస్తులతోపాటు రేవంత్‌రెడ్డి కుటుంబ ఆస్తులపైనా సుప్రీంకోర్టు లేదా హైకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణకు తాను సిద్ధమని సవాల్ విసిరారు. ఆర్మూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు గురువారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ పనితీరు, ముఖ్యమంత్రి ఇటీవల సిరిసిల్లలో చేసిన వ్యాఖ్యలపై స్పందించారు. ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కేటీఆర్ ఆరోపించారు. తగినంత విద్యుత్ అందడం లేదని, యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, రైతుబంధు సకాలంలో అందడం లేదని విమర్శించారు. ఆరు గంటలు కూడా విద్యుత్ రావడం లేదన్నది కేటీఆర్ చేసిన ఆరోపణ కాగా, దీనికి సంబంధించిన స్వతంత్ర రాష్ట్రవ్యాప్త గణాంకాలను ఆయన వెల్లడించలేదు. కాళేశ్వరం ప్రాజెక్టు, విద్యుత్ కొనుగోళ్లు, ఫార్ములా-ఈ వ్యవహారాలపై ప్రభుత్వం విచారణలు చేపట్టిందని గుర్తుచేసిన కేటీఆర్.. వాటి ద్వారా ఇప్పటివరకు ఏం తేలిందో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, ఇతర హామీల అమలు నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే తమ కుటుంబంపై పదేపదే ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు.

## 'మీ ఆస్తులు.. మా ఆస్తులు.. తేల్చేద్దాం'

తన ఆస్తులపై ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలకు స్పందించిన కేటీఆర్.. అమెరికాలో ఆరేళ్లు ఉద్యోగం చేసి సంపాదించిన డబ్బుతో 2006లో హోటల్ వ్యాపారం ప్రారంభించినట్లు చెప్పారు. తన వ్యాపారాలు, ఆస్తుల వివరాలను ఎన్నికల అఫిడవిట్లలోనే వెల్లడించానని పేర్కొన్నారు. తన కుటుంబంతోపాటు ముఖ్యమంత్రి కుటుంబ ఆస్తులపైనా సిట్టింగ్ సుప్రీంకోర్టు లేదా హైకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని సవాల్ చేశారు. ఈ ఆస్తులకు సంబంధించి ఇరువైపులా వస్తున్న ఆరోపణలు రాజకీయ వాదనలే తప్ప, అవి న్యాయపరంగా నిర్ధారిత అక్రమాలుగా తేలలేదు. సిరిసిల్ల పర్యటన సందర్భంగా భారీ పోలీసు బందోబస్తు మధ్య ముఖ్యమంత్రి పర్యటించారని విమర్శించిన కేటీఆర్.. "నల్లమల పులి అని చెప్పుకుంటారు.. వేల మంది పోలీసుల మధ్య పర్యటిస్తారా? నువ్వు నల్లమల పులివి కాదు.. చంద్రబాబు పిల్లివి" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. చేనేత కార్మికుల సమస్యలను ముఖ్యమంత్రి పట్టించుకోలేదని కేటీఆర్ ఆరోపించారు. బతుకమ్మ చీరల ఆర్డర్లు, పాఠశాల యూనిఫాం పనులు, నేతన్న బీమా తదితర అంశాలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత చేనేత కార్మికుల ఆత్మహత్యలు జరిగాయన్న కేటీఆర్ ఆరోపణలపై వేర్వేరు బీఆర్ఎస్ నేతలు వేర్వేరు సంఖ్యలను ప్రస్తావిస్తున్నందున అధికారిక గణాంకాలతో నిర్ధారణ అవసరం. కేంద్రంలోని బీజేపీపైనా కేటీఆర్ విమర్శలు చేశారు. రైతుల ఆదాయం రెట్టింపు, బుల్లెట్ రైలు, గృహ నిర్మాణం, ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ తదితర హామీల అమలు ఏమైందని ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్, కేంద్రంలో బీజేపీ ఇచ్చిన హామీలపై ప్రజల తరఫున ప్రశ్నిస్తూనే ఉంటామని పేర్కొన్నారు.

# 24 గంటల కరెంట్ హామీ ఏమైంది?

- మన రైతుల పంటలు ఎండుతుంటే.. రాజస్థాన్ కు విద్యుత్ అమ్ముకుంటారా?
- కనీసం 7, 8 గంటలు కూడా ఇవ్వలేకపోతోంది..
- లో వోల్టేజ్ తో మోటార్లు, ట్రాన్స్ ఫార్మర్లు కాలిపోతున్నాయి..
- ఏడాదిలో 2 లక్షల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు పెండింగ్ .
- కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు ధ్వజం
- 20 గంటల నాణ్యమైన విద్యుత్, పెండింగ్ కనెక్షన్లు ఇవ్వాలని డిమాండ్
- నంగునూరు మండలంలో క్షేత్రస్థాయి పరిశీలన



**హైదరాబాద్, అక్టోబర్ 1 (ఉద్యమ కెరటం):** మన రాష్ట్రంలో రైతులకు కరెంట్ సక్రమంగా లేక పంటలు ఎండుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం రాజస్థాన్‌కు సింగరేణి విద్యుత్ అమ్ముకుంటుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు ధ్వజమెత్తారు. గురువారం ఆయన నంగునూరు మండలంలోని పాలమాకుల, అక్కనేపల్లి, అంక్షాపూర్ గ్రామాలలో పర్యటించారు. అనంతరం నర్మెట సబ్ స్టేషన్ ను సందర్శించి రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలపై మీడియాతో మాట్లాడారు.. పాలమాకుల, అక్కనేపల్లి, అంక్షాపూర్ గ్రామాలలో రైతులను నేరుగా కలిసిన సమయంలో ప్రతీ రైతు విద్యుత్ లో వోల్టేజ్తో మోటార్లు, ట్రాన్స్ ఫార్మర్లు కాలిపోతున్నాయని ఫిర్యాదు చేశారన్నారు. ఈ పరిస్థితిని తెలుసుకునేందుకు సంబంధిత నర్మెట సబ్ స్టేషన్ కు వెళ్లి పరిశీలించగా ఏ రోజూ రైతులకు 10 గంటల కరెంటు రావడం లేదని, కేవలం 7 నుంచి 8 గంటలు మాత్రమే విద్యుత్ సరఫరా వస్తున్నట్లు తెలిసిందన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో 22 గంటల నాణ్యమైన విద్యుత్ అందిస్తుంటే గగ్గోలు పెట్టి విమర్శ చేసిన కాంగ్రెస్ వాళ్లు నేడు అందులో సగం గంటలు కూడా ఇవ్వలేకపోతున్నారని ధ్వజమెత్తారు. అంక్షాపూర్ లో ఓ యువ రైతు తన ఎనిమిది ఎకరాల పొలం కరెంటు లేక ఎండిపోతోందని తన గోడును వెళ్లబుచ్చాడన్నారు. పాలమాకులలో మూడు రోజుల క్రితం ట్రాన్స ఫార్మర్ కాలిపోతే ఇప్పటికీ ఇవ్వలేదు, కరెంటు లేక పంటలు ఎండుతున్నాయని రైతులు వాపోతున్నారు. అంతేకాకుండా నంగునూరులో 3, గట్లమల్యాలలో 2 ట్రాన్స్ ఫార్మర్లు కాలిపోయి మూడు రోజులైనా కొత్తవి ఇవ్వడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఒక్క మండలంలోనే వారంలో 41 ట్రాన్స ఫార్మర్లు, 100 నుంచి 200 మోటార్లు కాలిపోయినట్లు రైతులు తెలిపారని అన్నారు. దానికి కారణం ఏమిటని తెలుసుకోగా సబ్ స్టేషన్లో లోవోల్టేజీ సమస్య గుర్తించామన్నారు. ఈ నాసిరకం లో వోల్టేజ్ కరెంటు వల్లే రైతుల మోటార్లు, ట్రాన్స్ ఫార్మర్లు కాలిపోతున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మోటార్లు కాలిపోవడం వల్ల రైతులకు దనపు భారం, ఆర్థిక భారం పడుతోందన్నారు. ఇది పూర్తిగా చేతగాని ప్రభుత్వం, ఈ ప్రభుత్వ వైఫల్యానికి ఇది నిదర్శనమన్నారు. ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి ఎందుకు దీనిపై రివ్యూ చేయడం లేదని ప్రశ్నించారు. మన రాష్ట్రంలో కరెంటు లేదు కానీ.. సింగరేణిలో ఉత్పత్తి అవుతున్న 800 మెగావాట్ల విద్యుత్‌ను రాజస్థాన్‌కు అమ్ముతామని జాయింట్ వెంచర్ అగ్రిమెంట్ ఎందుకు చేసుకున్నారు అని ప్రశ్నించారు. మీరు చెప్పిందేమో 24 గంటల కరెంటు, కానీ ఇస్తున్నది కేవలం తొమ్మిది గంటలే. అందులోనూ మధ్యమధ్యలో ట్రిప్ అవుతోంది. మెటీరియల్ లేదనే సాకుతో రాష్ట్రవ్యాప్తంగా రెండు లక్షల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను సంవత్సర కాలంగా పెండింగ్ లో పెట్టారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఏ నెల కనెక్షన్లు ఆ నెలకే రిలీజ్ చేసేవాళ్లం. అప్పుడు 4,500 రూపాయలు ఉన్న డీడీ చార్జీలను ఈ కాంగ్రెస్ వాళ్లు 9,000 రూపాయలకు పెంచారు. అయినా డీడీలు కట్టిన రైతులకు కనెక్షన్లు ఇవ్వకుండా ఎదురుచూపులు చూసేలా చేస్తున్నారు. మూడు రోజులు ట్రాన్స ఫార్మర్ లేకపోతే రైతుల పంటలు ఏమవ్వాలి? మీ ఇంటెలిజెన్స్ కు ఇవేవీ కనబడటం లేదా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి గాలిలో తిరిగితే రైతుల సమస్యలు ఎట్లా తెలుస్తాయి.. నేల మీదకు వచ్చి రైతుల దగ్గరకు వస్తే వాస్తవాలు తెలుస్తాయి. ప్రస్తుతం ఎండలు ఎక్కువగా ఉండి నీరు కిందికి జారడం లేదు. కాబట్టి లో-వోల్టేజ్ లేకుండా రాత్రి పూట కలుపుకుని కనీసం 20 గంటల కరెంటును రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అప్పట్లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కరెంటు రెండు గంటలు తగ్గితే.. లాగ్ బుక్కుల కోసం సబ్ స్టేషన్ల చుట్టూ ఉరికి ఉరికి తిరిగారు. ఇప్పుడు ఎనిమిది గంటలే వస్తుంటే ఎందుకు తిరగడం లేదు? ఆయన ఇప్పుడు కూడా లాగ్ బుక్కుల కోసం తిరగాలని అన్నారు. ఇప్పటికైనా మేము ప్రభుత్వాన్ని డిమాండ్ చేసేది ఒకటే.. రైతులకు 20 గంటల నాణ్యమైన కరెంటు ఇవ్వాలి, ట్రాన్స్ ఫార్మర్లకు రోలింగ్ స్టాక్ పెట్టాలి, కాలిపోయిన వెంటనే కొత్తది ఇవ్వాలి, పెండింగ్ లో ఉన్న 2 లక్షల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను వెంటనే విడుదల చేయాలి, అన్ని జిల్లాల్లోని స్టోర్లలో వ్యవసాయ విద్యుత్‌కు అవసరమైన ఎక్విప్ మెంట్‌ను ప్రభుత్వం స్టాక్ మెయింటైన్ చేయాలని అన్నారు.

# ఎస్ఐఆర్‌కు ఇదే తుది గడువు



- నవంబర్ 5 తర్వాత గడువు పొడిగించేది లేదన్న సీఈవో సుదర్శన్ రెడ్డి
- 92 లక్షల మందికి నోటీసులు.. 65 లక్షల మంది స్పందన
- 54 లక్షల మంది ఇప్పటికే తుది జాబితాలోకి
- ఓటర్ల ఇళ్ల వద్దకే వెళ్లి పత్రాలు తీసుకోనున్న బీఎల్‌వోలు
- నవంబర్ 9న తుది ఓటరు జాబితా ప్రచురణ

**హైదరాబాద్, అక్టోబర్ 1 (ఉద్యమ కెరటం):** ఎస్ఐఆర్ ప్రక్రియకు నవంబర్ 5తో గడువు ముగుస్తుందని, ఆ తర్వాత మరోసారి పొడిగించే అవకాశం లేదని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈవో) సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఇప్పటికే ఒకసారి గడువు పెంచినందున ఇక పొడిగింపు ఉండదని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఉన్న షెడ్యూల్ ప్రకారమే ప్రక్రియను పూర్తి చేస్తామని చెప్పారు.

## 92 లక్షల మందికి నోటీసులు

రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఐఆర్‌లో భాగంగా 92 లక్షల మందికి నోటీసులు ఇవ్వగా.. 65 లక్షల మంది ఇప్పటివరకు స్పందించారని సీఈవో తెలిపారు. వీరిలో 54 లక్షల మందిని తుది ఓటరు జాబితాలోకి చేర్చినట్లు వెల్లడించారు. నవంబర్ 5లోగా మిగిలిన అర్హులైన ఓటర్లను కూడా తుది జాబితాలోకి తీసుకురావడానికి చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఇకపై హియరింగ్‌కు బదులుగా అవసరమైన పత్రాల సేకరణపైనే దృష్టి పెడతామని సుదర్శన్ రెడ్డి తెలిపారు. నోటీసులు అందుకున్న వారి ఇళ్ల వద్దకే బీఎల్‌వోలు వెళ్లి పత్రాలు తీసుకుంటారని చెప్పారు. ఓటర్లను ఒకచోటకు పిలిపించకుండా నివాసాల వద్దే వివరాలు సేకరించాలని ఆదేశించినట్లు తెలిపారు. కుటుంబ సభ్యులందరూ హాజరు కావాల్సిన అవసరం లేదని.. ఒకరు మిగిలిన కుటుంబ సభ్యుల వివరాలు అందిస్తే సరిపోతుందని చెప్పారు. వలస వెళ్లిన ఓటర్లను పిలవాల్సిన అవసరం లేదని, ఈఆర్ఓ ఆన్‌లైన్‌లోనే వారిని సంప్రదించి ప్రక్రియ పూర్తి చేస్తారని తెలిపారు.



## నవంబర్ 9న తుది జాబితా

తెలంగాణలో ఎస్ఐఆర్ ఇంకా కొనసాగుతున్నందున ఫారం-6కు డిక్లరేషన్ తప్పనిసరి అని సీఈవో స్పష్టం చేశారు. క్లెయిమ్‌లు, అభ్యంతరాల దాఖలుకు అక్టోబర్ 7 వరకు గడువు ఉందన్నారు. నోటీసుల జారీ, అభ్యంతరాల పరిష్కారం నవంబర్ 5 వరకు కొనసాగుతుందని.. నవంబర్ 9న తుది ఓటరు జాబితాను ప్రచురించనున్నట్లు తెలిపారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలో 80 వేల మందికి నోటీసులు జారీ చేశామని సుదర్శన్ రెడ్డి తెలిపారు. నోటీసులు అందుకున్న వారిలో 40 శాతం మందిని ఇప్పటికే తుది ఓటరు జాబితాలోకి తీసుకువచ్చినట్లు వెల్లడించారు.

# 20 వేల ఓట్లు వెంటనే చేర్చాలి

- ఖైరతాబాద్‌లో ఓట్ల తొలగింపుపై దానం నాగేందర్ తీవ్ర ఆగ్రహం
- తొలగించిన ఓట్లను అదనపు జాబితాలో చేర్చాలని డిమాండ్
- బీజేపీతో కుమ్మక్కై 'ఓట్ చోరీ'కి పాల్పడుతున్నారని ఆరోపణ
- బాధ్యులైన అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్
- ఓటు హక్కు పరిరక్షణ కోసం ఆందోళనలు కొనసాగుతాయని వెల్లడి



**హైదరాబాద్, అక్టోబర్ 1 (ఉద్యమ కెరటం):** "ఖైరతాబాద్ నియోజకవర్గంలో దాదాపు 20 వేల ఓట్లను అన్యాయంగా తొలగించారు.. వాటన్నింటినీ వెంటనే ఓటర్ల జాబితాలో చేర్చాలి" అని ఎమ్మెల్యే, మాజీ మంత్రి దానం నాగేందర్ డిమాండ్ చేశారు. తొలగించిన ఓట్లను తిరిగి చేర్చకపోతే నిరసనలు మరింత తీవ్రరూపం దాల్చుతాయని హెచ్చరించారు. ఓటు హక్కు పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ ఇచ్చిన పిలుపు మేరకు ఆందోళనలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

## బీజేపీతో కుమ్మక్కై ఓట్ చోరీ: దానం

హైదరాబాద్ నగరంలో పెద్ద ఎత్తున 'ఓట్ చోరీ' జరుగుతోందని దానం నాగేందర్ ఆరోపించారు. ప్రజలను ఈ పరిణామాల నుంచి కాపాడుకోవాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. కొంతమంది అధికారులు బీజేపీ నాయకులతో కుమ్మక్కై వారి ఆదేశాల మేరకు ఓట్లను తొలగించే కుట్రకు పాల్పడుతున్నారని ఆరోపించారు. 2000, 2002 నుంచి నివాసముంటూ, ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఓటు హక్కు వినియోగించుకున్న నిజమైన ఓటర్ల పేర్లను ఇప్పుడు కావాలనే జాబితా నుంచి తొలగించారని అన్నారు. నిజమైన ఓటర్ల పేర్లను తొలగించేందుకు ప్రయత్నిస్తున్న అధికారులపై తక్షణమే క్రిమినల్ చర్యలు తీసుకోవాలని దానం నాగేందర్ డిమాండ్ చేశారు. అర్హులైన పౌరులను ఓటర్ల జాబితా నుంచి తొలగించడం చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. ఇప్పటివరకు తొలగించిన 20 వేల ఓట్లను అదనపు జాబితా ద్వారా తిరిగి చేర్చి ప్రతి ఒక్కరికీ ఓటు వేసే అవకాశం కల్పించాలని కోరారు. లేని పక్షంలో రాబోయే రోజుల్లో ఆందోళనలు మరింత ఉధృతమవుతాయని హెచ్చరించారు.

# మెట్రో.. ఆర్టీసీకి ఒకే పాస్!

- హైదరాబాద్ ప్రయాణికులకు ఉమ్మడి పాస్ విధానం
- రోజువారీ జాయింట్ పాస్ రూ.400.. నెలవారీ పాస్ రూ.8,500
- ఒకే పాస్‌తో మెట్రో రైలు, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం
- అప్‌గ్రేడ్ చేసిన 'మీ టికెట్' యాప్ రేపు ప్రారంభం
- మొబైల్ నుంచే బస్ టికెట్లు, డే పాస్, వార, నెలవారీ పాస్‌లు




**హైదరాబాద్, అక్టోబర్ 1 (ఉద్యమ కెరటం):** హైదరాబాద్ నగర ప్రజా రవాణాలో ప్రభుత్వం కీలక మార్పు తీసుకొచ్చింది. ఇక మెట్రో రైలు, ఆర్టీసీ బస్సుల్లో ఒకే పాస్‌తో ప్రయాణించే అవకాశం కల్పిస్తూ 'కామన్ పాస్' విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. అప్‌గ్రేడ్ చేసిన 'మీ టికెట్' మొబైల్ యాప్‌తో ఈ సేవలను మరింత సులభతరం చేయనున్నారు. ఉమ్మడి పాస్ విధానాన్ని రేపు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అధికారికంగా ప్రారంభించనున్నారు. మెట్రో, ఆర్టీసీ సేవలను అనుసంధానిస్తూ రోజువారీ, నెలవారీ జాయింట్ పాస్‌లను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. రోజువారీ పాస్ ధరను రూ. 400గా, నెలవారీ పాస్‌ను రూ. 8,500గా నిర్ణయించారు. ఈ పాస్ ఉన్న ప్రయాణికులు రెండు రవాణా వ్యవస్థల్లోనూ ప్రయాణించవచ్చు. ఉద్యోగులు, వ్యాపారులు, నగరంలోని వివిధ ప్రాంతాలకు ప్రతిరోజూ రాకపోకలు సాగించే వారికి ఈ విధానం ఉపయోగపడనుంది. ఆర్టీసీ బస్సుల్లోనూ డిజిటల్ టికెటింగ్ విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. కండక్టర్ నుంచి పేపర్ టికెట్ తీసుకోవాల్సిన అవసరం లేకుండా ప్రయాణికులు మొబైల్ ద్వారానే టికెట్ పొందే సదుపాయం కల్పించారు. అప్‌గ్రేడ్ చేసిన 'మీ టికెట్' యాప్‌లో రోజువారీ టికెట్లు, డే పాస్‌లతో పాటు వారంరోజుల పాస్, నెలవారీ బస్ పాస్‌లను కూడా కొనుగోలు చేసుకునే అవకాశం కల్పించారు. నగర ప్రజా రవాణాను మరింత వేగవంతంగా, సులభతరం చేసే దిశగా ఈ డిజిటల్ సేవలను తీసుకొచ్చారు.

# కూల్‌డ్రింక్ సీసాలపై తుప్పు..



**కరీంనగర్, అక్టోబర్ 1 (ఉద్యమ కెరటం) :** కరీంనగర్‌లో ఆహార భద్రతా శాఖ తనిఖీల్లో 200 మి.లీ. కూల్‌డ్రింక్ గాజు సీసాల మూతల వద్ద తుప్పు గుర్తించారు. సంబంధిత పంపిణీ కేంద్రంలో తనిఖీలు నిర్వహించి, ఇదే సమస్య ఉన్న సుమారు 60 కేసుల సీసాలను స్వాధీనం చేసుకున్నారు. తయారీ సంస్థకు నోటీసులు జారీ చేసి, ఆహార భద్రతా చట్టం ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా, ఆహార భద్రతా అధికారుల పేరుతో కొందరు డబ్బులు డిమాండ్ చేస్తూ మోసాలకు పాల్పడుతున్నారని శాఖ హెచ్చరించింది. అనుమానాస్పద కాల్స్ లేదా వ్యక్తుల గురించి వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించింది.



# 2026 ప్రధాని అభ్యర్థిగా రాహుల్ ఓకేనా?

**2029 లోక్‌సభ ఎన్నికలపై మమతా బెనర్జీ కీలక వ్యాఖ్యలు**

**రాహుల్ అభ్యర్థిగా సమర్థిస్తారా? అనే ప్రశ్నకు దాటవేత**

**సమయం వచ్చినప్పుడు నిర్ణయిస్తామని కామెంట్**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 1 (ఉద్యమ కెరటం):** 2029 లోక్‌సభ ఎన్నికల్లో ప్రతిపక్ష ఇండియా కూటమి ప్రధాని అభ్యర్థిగా రాహుల్ గాంధీని సమర్థిస్తారా? అని మమతా బెనర్జీని ప్రశ్నించిన సమయంలో ఆమె సమాధానాన్ని దాటవేశారు. ఇలాంటి ప్రశ్నలు అడగొద్దని, తామంతా ఒకే కుటుంబమని, సమయం వచ్చినప్పుడు నిర్ణయం తీసుకుంటామని ఆమె అన్నారు. ఈ వ్యాఖ్యలతో ప్రధాని అభ్యర్థిగా రాహుల్‌ను మమతా ప్రస్తుతానికి సమర్థించడం లేదని అర్థమవుతోంది. సమయం వచ్చినప్పుడు ప్రధాని అభ్యర్థిత్వంపై నిర్ణయం తీసుకుంటామని గత పదేళ్లుగా తృణమూల్ అధినేత్రి చెబుతూ వస్తున్నారు. ఈసారి కూడా ఇదే తరహా వ్యాఖ్యలు చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వ్యవహారంలో ఇండియా కూటమి సమావేశానికి మమతా బెనర్జీ గట్టి మద్దతుదారుగా నిలిచారు. ఇదే సమయంలో బద్ధశత్రువు అయిన సీపీఎం పార్టీతో మమతా కలిసేందుకు సిద్ధమయ్యారు. పశ్చిమ బెంగాల్‌లో ఘోర పరాజయం తర్వాత ఇండియా కూటమిని యాక్టివ్ చేసే చర్య ల్లో మమతా బెనర్జీ కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఈ ఎన్నికల్లో ఈసీ బీజేపీ గెలుపుకు సహాయపడిందని ఆమె ఆరోపిస్తున్నారు. సెప్టెంబర్ 30న జరిగిన కూటమి సమావేశంలో కూడా ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ ఆగ్రహంగా మాట్లాడారు. భేటీ తర్వాత ఆమె మాట్లాడుతూ.. అవసరమైతే తాను డీఎంకే, ఆమ్ ఆద్మీ పార్టీ, అఖిలేష్ యాదవ్ తరుపున ప్రచారం చేసేందుకు కూడా సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు.

# మై-బాప్ సర్కార్ కాదు.. పౌరుడే ప్రధానం

**యూపీఎస్సీ శతాబ్ది వేడుకల్లో ప్రధాని మోదీ కీలక సందేశం**

**'దేశం ముందు.. పౌరుడు ముందు' అనే రెండు ప్రమాణాలే కీలకమని స్పష్టీకరణ**

**'పదవి కోసం కాదు.. ప్రజాసేవ కోసం వచ్చే యువతను ఎంపిక చేయాలి'**

**వందేళ్ల ప్రస్థానానికి గుర్తుగా స్మారక నాణెం, తపాలా బిళ్ల విడుదల**



**న్యూఢిల్లీ, అక్టోబర్ 1 (ఉద్యమ కెరటం):** "ప్రభుత్వమే మై-బాప్ అనే పాత ఆలోచన నుంచి బయటకు రావాలి.. పౌరుడే కేంద్రంగా, పౌరుడి సేవే పరమావధిగా పరిపాలన సాగాలి" అని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం న్యూఢిల్లీలోని భారత్ మండపంలో నిర్వహించిన శతాబ్ది వేడుకల్లో ఆయన ప్రసంగించారు. సివిల్ సర్వీసుల ఎంపికలో 'దేశం ముందు.. పౌరుడు ముందు' అనే రెండు ప్రమాణాలను ఎప్పుడూ గుర్తుంచుకోవాలని సూచించారు. 1926 అక్టోబర్ 1న పబ్లిక్ సర్వీస్ కమిషన్‌గా ప్రారంభమైన సంస్థ శతాబ్ది ప్రస్థానానికి గుర్తుగా ప్రధాని ప్రత్యేక స్మారక నాణెం, తపాలా బిళ్లతోపాటు ప్రభుత్వ సేవా కమిషన్ల విధానాలను ప్రభావితం చేసిన వంద కీలక న్యాయ తీర్పులతో రూపొందించిన పుస్తకాన్ని విడుదల చేశారు.

**తెలివి ఒక్కటే కాదు.. సేవా తపననూ చూడాలి**

సివిల్ సర్వీసుల్లోకి వచ్చే అభ్యర్థికి ఎంత పరిజ్ఞానం ఉందన్నది మాత్రమే పరీక్షిస్తే సరిపోదని మోదీ పేర్కొన్నారు. అసలు ఆ యువకుడు లేదా యువతి ప్రజాసేవలోకి ఎందుకు రావాలనుకుంటున్నారు?.. ప్రజా పదవిపై ఆకర్షణతో వస్తున్నారా?.. ప్రజలకు సేవ చేయాలన్న సంకల్పంతో వస్తున్నారా?.. అనే అంశాలను కూడా ఎంపిక విధానం గుర్తించేలా ఉండాలని సూచించారు. "ప్రజా పదవి కోసం కాకుండా ప్రజాసేవ చేయాలన్న తపనతో వచ్చే యువత ప్రభుత్వ సేవల్లోకి రావాలి" అని చెప్పారు. వందేళ్లలో తరాలు మారాయని, ప్రభుత్వాలు మారాయని, సాంకేతికత, పాఠ్యాంశాల్లో ఎన్నో మార్పులు వచ్చాయని ప్రధాని గుర్తుచేశారు. అయినప్పటికీ యూపీఎస్సీపై ప్రజల్లో విశ్వాసం కొనసాగుతోందన్నారు. ప్రతి సంవత్సరం లక్షలాది మంది యువత సివిల్ సర్వీసుల్లోకి రావాలన్న ఆకాంక్షతో పరీక్షలకు సిద్ధమవుతున్నారని, అందువల్ల ఈ శతాబ్ది ఉత్సవం సంస్థదే కాకుండా యువత ఆకాంక్షల వేడుక కూడా అని పేర్కొన్నారు. ఇరవై ఒకటో శతాబ్దపు భారతదేశానికి కొత్త పని సంస్కృతి అవసరమని మోదీ అన్నారు. ప్రభుత్వం అన్నింటికీ అధిపతి అన్న ధోరణి కాకుండా ప్రజల అవసరాలు, సమస్యలను అర్థం చేసుకుని పరిష్కరించే పరిపాలనా వ్యవస్థ ఉండాలని పేర్కొన్నారు. 'నాగరిక్ దేవో భవ' తమ మంత్రమని, పౌరుడి సేవకే అత్యున్నత ప్రాధాన్యం ఉండాలని చెప్పారు. స్వాతంత్ర్యం అనంతరం దేశ పరిపాలనా వ్యవస్థను బలోపేతం చేయడంలో సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ పాత్రను ప్రధాని గుర్తుచేశారు. యూపీఎస్సీ శతాబ్ది ప్రదర్శనను పరిశీలించిన సందర్భంగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ సివిల్ సర్వీసుల పరీక్ష రాసిన చారిత్రక సందర్భాన్ని ప్రస్తావించారు. ఇదే కార్యక్రమంలో ఫ్లైదుబాయ్ విమాన ఘటనలో భారత పైలట్ స్మిత్ మచ్చర్ చూపిన ధైర్యాన్ని మోదీ ప్రత్యేకంగా ప్రశంసించారు. తీవ్రంగా గాయపడినప్పటికీ ఆయన చూపిన సమయస్ఫూర్తి, సాహసం దేశానికి గర్వకారణమని పేర్కొన్నారు. మచ్చర్ తల్లిదండ్రులు, భార్యతో తాను మాట్లాడినట్లు వెల్లడించారు. ఆయన ప్రస్తుతం చికిత్స పొందుతున్నారని, త్వరగా కోలుకోవాలని దేశ ప్రజలు ప్రార్థించాలని కోరారు.

# 3 నెలలు జైల్లో పెట్టినా పోరాటం ఆగదు

- సీఈసీ జ్ఞానేష్‌కుమార్ రాజీనామా కోరుతూ సీజేపీ ఉద్యమ పిలుపు
- అక్టోబర్ 2న ముంబై శివాజీ పార్క్‌లో 'జైల్ భరో ఆందోళన్'
- అనుమతి నిరాకరించినా వెనక్కి తగ్గబోమన్న అభిజీత్ దీప్కే



**ముంబై, అక్టోబర్ 1 (ఉద్యమ కెరటం):** "మూడు రోజులు కాదు.. మూడు నెలలు జైల్లో పెట్టినా మా పోరాటం ఆగదు" అంటూ కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ప్రకటించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్‌కుమార్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా ముంబైలోని శివాజీ పార్క్ వద్ద 'జైల్ భరో ఆందోళన్' చేపట్టనున్నట్లు వెల్లడించారు. అక్కడ నిరసనకు ముంబై పోలీసులు అనుమతి ఇవ్వకపోయినా కార్యక్రమాన్ని కొనసాగిస్తామని సీజేపీ ప్రకటించింది. ముంబైలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో దీప్కే మాట్లాడుతూ.. అనుమతి నిరాకరణతో తమ ఉద్యమం ఆగదన్నారు. ముంబై నుంచి ప్రారంభమయ్యే ఆందోళనను దేశంలోని ఇతర రాష్ట్రాలకు విస్తరిస్తామని తెలిపారు. జ్ఞానేష్‌కుమార్ రాజీనామా చేయకపోతే అక్టోబర్ చివరి నుంచి ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఉద్యమం చేపడతామని ప్రకటించారు.

**అనుమతి ఎందుకు ఇవ్వలేదంటే..**

శివాజీ పార్క్‌లో అక్టోబర్ 2న సభ నిర్వహించేందుకు అనుమతి ఇవ్వలేమని ముంబై పోలీసులు నిర్వాహకులకు తెలిపారు. అయితే ఇది కేవలం సీజేపీ నిరసనను అడ్డుకునేందుకు తీసుకున్న నిర్ణయమని చెప్పడానికి ఆధారాలు లేవు. బాంబే హైకోర్టు 2013 నాటి ఉత్తర్వులు, అనంతరం మహారాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల ప్రకారం శివాజీ పార్క్‌లో సభలకు అనుమతి ఇచ్చే అధికారం తమకు లేదని పోలీసులు పేర్కొన్నారు. ప్రత్యామ్నాయ ప్రదేశాన్ని ఎంపిక చేసుకుని అనుమతి కోరాలని సూచించారు. శబ్ద కాలుష్యం, ట్రాఫిక్ సమస్యలనూ అధికారులు ప్రస్తావించారు. అయినప్పటికీ అదే ప్రాంతంలో అక్టోబర్ 2 సాయంత్రం 4 గంటలకు 'జైల్ భరో' నిర్వహిస్తామని దీప్కే ప్రకటించారు. సీజేపీ ప్రతిపాదిత ఆందోళనకు బృహన్‌ముంబై మున్సిపల్ కార్పొరేషన్ అనుమతి కూడా లేదని అధికారులు తెలిపారు.

**సీఈసీ రాజీనామాతోపాటు మూడు డిమాండ్లు**

జ్ఞానేష్‌కుమార్ పదవికి రాజీనామా చేయడంతోపాటు ఆయనపై క్రిమినల్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టాలని సీజేపీ డిమాండ్ చేస్తోంది. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను నిలిపివేసి 2025 ఓటర్ల జాబితాను కొనసాగించాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ నియామక ప్రక్రియలో మరింత పారదర్శకతతోపాటు పౌర సమాజ భాగస్వామ్యానికి అవకాశం కల్పించాలని దీప్కే కోరుతున్నారు. ఇవి సీజేపీ చేస్తున్న రాజకీయ, సంస్థాగత డిమాండ్లు మాత్రమే; జ్ఞానేష్‌కుమార్‌పై నేరపూరిత చర్యలు నిర్ధారణ అయినట్లు ఎలాంటి న్యాయస్థాన తీర్పు వెలువడలేదు.

# అన్ని నిర్ణయాలు ఏకగ్రీవమే

- ఎన్నికల సంఘంలో అంతర్గత విభేదాల వార్తలపై ఈసీ క్లారిటీ!
- 'సర్' ప్రక్రియపై ప్రతిపక్షాల ఆరోపణలను తిరస్కరించిన ఎన్నికల కమిషన్
- గోవా సాంకేతిక లోపం, ఢిల్లీ బేలా ఎస్టేట్ వివాదాలపై స్పష్టత ఇచ్చి ఆరోపణలకు చెక్




**న్యూఢిల్లీ, అక్టోబర్ 1 (ఉద్యమ కెరటం):** ఎన్నికల సంఘం (ఈసీ) ముగ్గురు కమిషనర్ల మధ్య తీవ్ర స్థాయిలో విభేదాలు తలెత్తాయంటూ వస్తున్న వార్తలపై కేంద్ర ఎన్నికల సంఘ వర్గాలు గురువారం స్పందిస్తూ పూర్తి స్పష్టతనిచ్చాయి. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) నిర్వహణపై అనేక అనుమానాలు, వివాదాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో.. 2025 ఫిబ్రవరి 19 నుంచి కమిషన్ తీసుకున్న ప్రతి తుది నిర్ణయం ఏకగ్రీవంగానే జరిగిందని, ఏ ఒక్క కమిషనర్ కూడా విభేదించలేదని ఈసీ వర్గాలు వెల్లడించాయి. నకిలీ, మోసపూరిత, మరణించిన, వేరే ప్రాంతాలకు తరలిపోయిన ఓటర్లను తొలగించడంతో పాటు, అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడటమే 'సర్' ప్రధాన లక్ష్యమని ఈసీ పునరుద్ఘాటించింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్ నిర్ణయాలపై మిగతా ఇద్దరు కమిషనర్లు సుఖ్బీర్ సింగ్ సంధు, వివేక్ జోషిలు గత 10 నెలల కాలంలో 14 సార్లు అధికారికంగా తమ అభ్యంతరాలను వ్యక్తం చేశారంటూ 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' ఇటీవల సంచలన కథనాన్ని ప్రచురించింది. అయితే ఈ కథనం వెలువడిన వారం రోజులకు ఎన్నికల సంఘం స్పందిస్తూ.. సీఈసీ తీసుకున్న అన్ని నిర్ణయాలకు మిగతా ఇద్దరు కమిషనర్లు సంపూర్ణ అంగీకారం తెలిపిన తర్వాతే అమలు చేశామని స్పష్టం చేసింది. ఎన్నికల సంఘం రాజ్యాంగ వ్యవస్థ ప్రకారం ప్రతీ నిర్ణయంలో ముగ్గురు కమిషనర్ల అభిప్రాయానికి సమాన ప్రాధాన్యం ఉంటుందని, ఇద్దరు సమ్మతిస్తేనే అమలు సాధ్యమని, సీఈసీ ఏకపక్షంగా వ్యవహరించే ప్రసక్తి ఉండదని నిపుణులు సైతం విశ్లేషిస్తున్నారు. మరోవైపు 'సర్' ప్రక్రియలో బీజేపీకి అనుకూలంగా ఓట్లు తొలగిస్తున్నారని కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలతో పాటు కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేస్తున్న ఆరోపణలను ఈసీ తీవ్రంగా ఖండించింది. గోవాలో 97 మంది ఓటర్ల పేర్లు తొలగిపోవడానికి కేవలం సాంకేతిక లోపమే కారణమని, అందులో ఇప్పటికే 88 మంది పేర్లను తిరిగి చేర్చామని వివరించింది. ఢిల్లీలోని బేలా ఎస్టేట్‌లో 727 మంది ఓటర్ల పేర్లు తొలగించారంటూ రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలపై స్పందిస్తూ.. బూత్ లెవెల్ ఆఫీసర్ (బీఎల్‌ఓ) క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లిన సమయంలో ఎవరూ అందుబాటులో లేకపోవడం వల్లే ధ్రువీకరణ సంతకాలు పూర్తి కాలేదని క్లారిటీ ఇచ్చింది. దేశవ్యాప్తంగా దాదాపు 25,000 మంది ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు ఈ ప్రక్రియలో పారదర్శకంగా పాల్గొంటున్నారని, ఓటర్ల మార్పులు-చేర్పులు అనేవి వికేంద్రీకృత స్థాయిలో జరుగుతాయని వివరించింది. ప్రతిపక్షాలు ముంబై, ఢిల్లీ వేదికలుగా నిర్వహిస్తున్న నిరసనలు రాజకీయ ప్రేరేపితమైనవేనని స్పష్టం చేసింది.

# ఆకాశంలో ఐదుగురు హీరోలు!

**180 మంది ప్రాణాలను కాపాడిన భారతీయ పైలట్ స్మిత్ మచ్చర్‌తో పాటు నలుగురు ఇజ్రాయిల్ పౌరులు**

**రెప్పపాటులో విమానం కుప్పకూలకుండా అడ్డుకున్న ధీరులు.. ప్రధాని మోదీ, నెతన్యాహూ ప్రశంసలు**




**టెల్ అవీవ్/హైదరాబాద్, అక్టోబర్ 01 (ఉద్యమ కెరటం):** దుబాయ్ నుంచి ఇజ్రాయిల్‌లోని టెల్ అవీవ్ వెళ్తున్న ఫ్లైదుబాయ్ విమానంలో చోటుచేసుకున్న భయాందోళనకరమైన ఘటనలో 180 మంది ప్రయాణికుల ప్రాణాలను కాపాడి భారతీయ పైలట్ స్మిత్ మచ్చర్‌తో పాటు మరో నలుగురు ప్రయాణికులు ప్రపంచవ్యాప్తంగా నిజమైన హీరోలుగా నిలిచారు. బుధవారం గగనతలంలో ప్రయాణిస్తున్న సమయంలో ఓమన్ దేశానికి చెందిన కో-పైలట్ హఠాత్తుగా దాడికి తెగబడటంతో పైలట్ స్మిత్ తీవ్రంగా గాయపడి రక్తమోడారు. ఆ క్లిష్ట సమయంలో సదరు కో-పైలట్ విమానాన్ని కంట్రోల్స్ నుంచి తప్పించడంతో విమానం కేవలం నిమిషంలోపే ఏకంగా 16,000 అడుగుల కిందకు పడిపోయింది. అయితే తీవ్ర గాయాలతో ఉన్నప్పటికీ ధైర్యం వీడని పైలట్ స్మిత్ మచ్చర్, అసామాన్య పోరాటం చేసి కాక్‌పిట్ తలుపులను తెరిచారు. దీంతో ప్రయాణికులు లోపలికి ప్రవేశించి 9/11 తరహా తీవ్ర విపత్తును నివారించగలిగారు. కాక్‌పిట్ తలుపులు తెరుచుకోవడమే ఆలస్యం.. విమానంలో ప్రయాణిస్తున్న నలుగురు ఇజ్రాయిల్ పౌరులు క్షణాల్లో కాక్‌పిట్‌లోకి ప్రవేశించి ఉన్మాదిగా మారిన కో-పైలట్‌ను అదుపులోకి తీసుకున్నారు. వృత్తిరీత్యా ప్లంబర్ అయిన యానివ్ హయూన్ వెంటనే స్పందించి, దాడి చేసిన కో-పైలట్‌ను కంట్రోల్స్ నుంచి పక్కకు లాగి, విమానాన్ని స్థిరీకరించేందుకు కంట్రోల్ యోక్‌ను వెనక్కి లాగారు. ఈ సాహసానికి గానూ ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ ఆయనను ప్రత్యేకంగా అభినందించారు. ఆయనతో పాటు అసఫ్ రజువాన్ అనే బిజినెస్ మ్యాన్, బ్యాంక్ లియూమీ అండర్ రైటింగ్ కంపెనీ సీఈఓ జ్వికా మానెస్ కూడా కాక్‌పిట్‌లోకి వెళ్లి నిందితుడిని పట్టుకున్నారు. జ్వికా మానెస్ తన వద్ద ఉన్న హెడ్‌ఫోన్ వైర్లతో కో-పైలట్‌ను గట్టిగా కట్టేయగా, డెంటిస్ట్ డాక్టర్ షోటా ముసాయేవ్ తీవ్రంగా గాయపడిన పైలట్ స్మిత్ మచ్చర్‌కు ప్రథమ చికిత్స అందించి రక్తాన్ని అదుపు చేశారు. దీంతో విమానం సౌదీ అరేబియాలోని ఒక చిన్న విమానాశ్రయంలో సురక్షితంగా ల్యాండ్ అయ్యే వరకు పైలట్ స్పృహలోనే ఉండగలిగారు.

**పైలట్ మచ్చార్ ధైర్యసాహసాలు దేశానికి గర్వకారణం: ప్రధాని మోదీ**

ఈ వీరోచిత ఘటనపై భారత ప్రధాని నరేంద్ర మోదీ స్పందిస్తూ పైలట్ స్మిత్ మచ్చార్ ధైర్యసాహసాలను కొనియాడారు. గురువారం స్మిత్ మచ్చార్ భార్య, తల్లిదండ్రులతో ప్రధాని ఫోన్ ద్వారా మాట్లాడి పలకరించారు. శరీరం రక్తమోడుతున్నా ప్రాణాలకు తెగించి పోరాడి కాక్‌పిట్ డోర్ తెరవడం వల్లే 174 మంది ప్రయాణికుల ప్రాణాలు దక్కాయని, విమానయాన చరిత్రలోనే మరొక ఘోర ప్రమాదం త తప్పిందని ప్రధాని పేర్కొన్నారు. ఆయన వైద్య చికిత్సకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను భారత ప్రభుత్వం తరపున అందజేస్తామని భరోసా ఇచ్చారు.

# మహిళా సంఘాలకు కోడి పిల్లల పంపిణీ



**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** మండల కేంద్రంలో మహిళా సంఘాల సభ్యులకు గురువారం కోడి పిల్లల యూనిట్లను పంపిణీ చేశారు. సెర్ప్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకంలో భాగంగా అర్హులైన స్వయం సహాయక సంఘాల మహిళలకు అధికారులు వీటిని అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మండల సమైక్య పరిధిలోని ప్రతి గ్రామ సంఘానికి ఐదు యూనిట్ల చొప్పున కోడి పిల్లలను అందించనున్నట్లు తెలిపారు. ఒక్కో యూనిట్లో 20 కోడి పిల్లలు ఉండగా, యూనిట్ ఖర్చు రూ.2,500గా పేర్కొన్నారు. గ్రామీణ మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు కోళ్ల పెంపకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. కోళ్ల పెంపకం ద్వారా ఇంటి వద్దనే గుడ్లు, మాంసం విక్రయిస్తూ మహిళలు అదనపు ఆదాయం పొందవచ్చని అన్నారు. తక్కువ పెట్టుబడితో ఉపాధి పొందే అవకాశం ఉండటంతో మహిళలకు ఈ పథకం ఎంతో దోహదపడుతుందని తెలిపారు. సక్రమంగా కోళ్లను పెంచితే నెలకు రూ.5వేల నుంచి రూ.8వేల వరకు ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. కోళ్ల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మేత అందించే విధానం, వ్యాక్సినేషన్పై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, సీసీలు, వీవోఏలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# కష్టకాలంలో అండగా ఉంటాం

## మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యే రాగమయి



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** కష్టకాలంలో బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్రెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. గురువారం ఖమ్మం జిల్లా తల్లాడ మండలంలో పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తల్లాడ పట్టణంలో ఇటీవల మృతిచెందిన గువ్వల రామిరెడ్డి దశదిన కర్మ కార్యక్రమానికి హాజరయ్యారు. రామిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ కష్టకాలంలో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం గొల్లగూడెం గ్రామంలో ఇటీవల మృతిచెందిన దుండేటి కేశవరెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ కష్ట సమయంలో అండగా ఉంటామని భరోసా కల్పించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమాల్లో టీజీఐడీసీ మాజీ చైర్మన్ మువ్వా విజయబాబు, తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొడుగునూరి లక్ష్మారెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు, సర్పంచ్లు, పార్టీ కార్యకర్తలు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ రిమాండ్తో కుంటుపడ్డ తుమ్మలగూడ అభివృద్ధి




**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** మండలంలోని తుమ్మలగూడ గ్రామపంచాయతీ సర్పంచ్ నేరారోపణల నేపథ్యంలో జ్యుడీషియల్ రిమాండ్కు వెళ్లడంతో గ్రామంలో అభివృద్ధి పనులు నిలిచిపోయాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్ అందుబాటులో లేకపోవడంతో పంచాయతీ పాలన అస్తవ్యస్తంగా మారిందని తెలిపారు. గ్రామంలో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధిదీపాల నిర్వహణ వంటి పనులు సక్రమంగా జరగడం లేదని పేర్కొన్నారు. ఇప్పటికే మంజూరైన సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు కూడా ప్రారంభానికి నోచుకోవడం లేదని తెలిపారు. ఈ నేపథ్యంలో గురువారం గ్రామస్తులు బెజ్జూర్ ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ను కలిసి వినతిపత్రం అందజేశారు. నిబంధనల ప్రకారం సర్పంచ్పై తగిన చర్యలు తీసుకుని, గ్రామపంచాయతీ పాలన సజావుగా సాగేందుకు తాత్కాలిక ఇన్చార్జ్ సర్పంచ్ను, నూతన సర్పంచ్ను నియమించాలని కోరారు. నిలిచిపోయిన అభివృద్ధి పనులను తక్షణమే పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన ఎంపీడీఓ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకునేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు.

# ప్రతిపక్ష సర్పంచులను ఇబ్బంది పెడితే సహించం

## మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప



**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** ప్రజలచే ఎన్నికైన ప్రతిపక్ష పార్టీలకు చెందిన సర్పంచులను అభివృద్ధి పనులు చేపట్టకుండా అధికారులు ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప హెచ్చరించారు. బెజ్జూర్ మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. గ్రామాల అభివృద్ధి కోసం ప్రజలు ఎన్నుకున్న సర్పంచులకు అధికారులు సహకరించాల్సిన బాధ్యత ఉందన్నారు. అయితే కొంత మంది అధికారులు ఉద్దేశపూర్వకంగా అభివృద్ధి పనులకు సంబంధించిన ఫైళ్లను పెండింగ్లో ఉంచుతున్నారని, పనులు పూర్తయినప్పటికీ బిల్లులు మంజూరు చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. సర్పంచులు ఏ పార్టీకి చెందిన వారైనా ప్రజల చేత ఎన్నుకోబడ్డారని పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధికి అధికారులు సహకరించాలని సూచించారు. ప్రతిపక్ష పార్టీలకు చెందిన సర్పంచులను లక్ష్యంగా చేసుకుని ఇబ్బందులకు గురిచేస్తే చూస్తూ ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. అభివృద్ధి పనులకు ఆటంకాలు సృష్టిస్తే ప్రజల తరఫున పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి సర్పంచులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కార్యకర్తలు ఐక్యంగా ఉండి ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని, గ్రామాల అభివృద్ధి కోసం నిరంతరం ప్రజల తరఫున పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో స్థానిక నాయకులు, సర్పంచులు, కార్యకర్తలు, కోనప్ప అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# సత్తుపల్లి సింగరేణిలో విస్తరణకు వేగం

- జేవీఆర్ఓసీ-2, జేవీఆర్ఓసీ-3 ప్రాజెక్టులపై సమీక్ష

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా సత్తుపల్లి సింగరేణి బొగ్గు గనుల ప్రాంతంలో బొగ్గు ఉత్పత్తి పెంపుతో పాటు భవిష్యత్ గనుల విస్తరణకు సంబంధించిన ప్రాజెక్టుల పురోగతిని వేగవంతం చేసే దిశగా సింగరేణి సంస్థ చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా ప్రణాళికలు, ప్రాజెక్టుల విభాగం డైరెక్టర్ కె.వెంకటేశ్వర్లు గురువారం సత్తుపల్లి ఏరియాలో విస్తృతంగా పర్యటించారు. ఆయన వెంట సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎస్.వెంకటచారి, పలువురు ఉన్నతాధికారులు ఉన్నారు. పర్యటనలో భాగంగా తొలుత జేవీఆర్ఓసీ-2 ఉపరితల గనిని డైరెక్టర్ పరిశీలించారు. బొగ్గు ఉత్పత్తి పురోగతి, నాణ్యతా ప్రమాణాలు, బొగ్గు రవాణా విధానం, విజయవాడ రహదారి మళ్లింపు తదితర అంశాలపై అధికారుల ద్వారా వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రతిపాదిత జేవీఆర్ఓసీ-3 ఉపరితల గని ప్రాజెక్టు ప్రాంతాన్ని సందర్శించారు. ప్రాజెక్టు సరిహద్దులు, గని విస్తరణకు ఉన్న అవకాశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సత్తుపల్లి ప్రాంతంలో బొగ్గు గనుల విస్తరణకు ఉన్న భౌగోళిక, సాంకేతిక, రవాణా అనుకూలతలను అధికారులు డైరెక్టర్కు వివరించారు. తదుపరి సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. బొగ్గు ఉత్పత్తి పెంపుదల, ప్రతిపాదిత జేవీఆర్ఓసీ-3 ప్రాజెక్టు పురోగతి, గనుల విస్తరణ అవకాశాలు, బొగ్గు రవాణా తదితర అంశాలపై



విస్తృతంగా చర్చించారు. సత్తుపల్లి ప్రాంతంలో ప్రస్తుత బొగ్గు ఉత్పత్తిని మరింత పెంచడంతో పాటు భవిష్యత్ గనుల విస్తరణకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు.

# నర్మాల గ్రామంలో ఫుడ్ వ్యర్థాల దహనం

- కాలుష్యంపై బీజేపీ నాయకుల ఆందోళన

**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** మండలంలోని నర్మాల గ్రామంలో గల ఆగత్స్య ఫుడ్ ఫ్యాక్టరీ సమీపంలో కాలంచెల్లిన ఆహార పదార్థాలు, ఫుడ్కు సంబంధించిన వ్యర్థాలను ఖాళీ ప్రదేశంలో డంపింగ్ చేసి దహనం చేస్తున్నారనే ఆరోపణలు స్థానికంగా ఆందోళనకు దారితీశాయి. వ్యర్థాలను తగలబెట్టడంతో పెద్దఎత్తున పొగ వెలువడుతూ పరిసర ప్రాంతాల్లో వాతావరణ కాలుష్యం ఏర్పడుతోందని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మల్లేశం, బూత్ అధ్యక్షుడు ఒరిగంటి ఎల్లం పేర్కొంటున్నారు. ఫ్యాక్టరీ సమీపంలోని ఖాళీ స్థలంలో ఆహార వ్యర్థాలు, ప్లాస్టిక్ సంచులు తదితర పదార్థాలు పేరుకుపోయి ఉండటంతో పాటు వాటిని కాల్చుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయని స్థానికులు తెలిపారు. దీంతో దుర్వాసన, పొగతో పాటు పరిసరాల్లో నివసించే ప్రజలు, పశువులు, పర్యావరణంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.





### పంచాయతీ పాలకవర్గానికి సమాచారం ఉందా..?

గ్రామ పరిధిలోనే ఇలాంటి వ్యర్థాలను బహిరంగ ప్రదేశంలో డంపింగ్ చేసి దహనం చేస్తున్న పరిస్థితిపై గ్రామ పంచాయతీ పాలకవర్గానికి సమాచారం ఉందా..? ఉంటే ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని బీజేపీ నాయకులు ప్రశ్నిస్తున్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్థలాన్ని పరిశీలించి, వ్యర్థాలను బహిరంగంగా దహనం చేయకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఈ సమస్యపై బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మాలేషంతో పాటు పలువురు గ్రామస్తులు స్పందిస్తూ.. నర్మాల గ్రామంలో వాతావరణ కాలుష్యాన్ని నివారించేందుకు పంచాయతీ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీ వ్యర్థాల నిర్వహణపై సంబంధిత అధికారులు విచారణ జరిపి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వ్యర్థాలను బహిరంగంగా డంపింగ్ చేయకుండా, దహనం చేయకుండా నియంత్రించి గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన వాతావరణం కల్పించాలని కోరారు.

# మధుర లబాన వేడుకల్లో ఆడే గజేందర్

**ఉద్యమ కెరటం, బజార్హత్నూర్:** మండలంలోని చందు నాయక్ తండా (బుతాయి) గ్రామంలో మధుర లబాన సమాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఋషి పంచమి వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఆడే గజేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామానికి చేరుకున్న ఆడే గజేందర్కు స్థానిక నాయకులు, భక్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం స్థానిక సర్పంచ్ రజాక్, కాంగ్రెస్ సీనియర్ నాయకులతో కలిసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. దేవి సింగ్ మహారాజ్, ప్రేమ్ సింగ్ మహారాజ్ ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా మధుర లబాన సమాజ్ సభ్యులు సాంప్రదాయ నృత్యాలు చేస్తుండగా, ఆడే గజేందర్ సైతం భక్తులతో కలిసి ఉత్సాహంగా నృత్యం చేశారు. అనంతరం మాట్లాడుతూ మధుర లబాన సమాజ్ సాంప్రదాయాలు, విశిష్ట సంస్కృతి, ఆధ్యాత్మిక విలువలు ఆదర్శనీయమన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులతో కలిసి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తిత్రే నారాయణ్ సింగ్, మాజీ రాష్ట్ర నెట్క్యాప్ డైరెక్టర్ చిలుకూరి భూమయ్య, మాజీ ఎంపీపీ సాబ్లే ప్రేమ్ సింగ్, బజార్హత్నూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కళ్యాం విఠల్, బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాబ్లే కైలాష్, మండల ఉపాధ్యక్షుడు రాథోడ్ రమేష్, మాజీ బోథ్ అసెంబ్లీ అధికార ప్రతినిధి యండి సద్దాం, ప్రధాన కార్యదర్శి గొల్ల నాగు రమేష్, నాయకులు మురళి, శరత్, సయ్యద్ సల్మాన్, నూర్ సింగ్, ఇందల్,



జగదీష్, బసందాస్, మౌలానా, భక్తులు, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు అచలాపూర్ విద్యార్థినులు

- జోనల్ స్థాయి పోటీల్లో మూడు గోల్డ్ మెడల్స్ సాధించి ప్రతిభ




**ఉద్యమ కెరటం, తాండూర్:** ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు అచలాపూర్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థినులు ఎంపికయ్యారని పీడీ ఎ.సాంబమూర్తి తెలిపారు. గురువారం ఆదిలాబాద్ ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా జోనల్ స్థాయి రెజ్లింగ్ పోటీల్లో అచలాపూర్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చాచారు. అండర్-14 విభాగంలో 62 కిలోల కేటగిరీలో 8వ తరగతి విద్యార్థిని పి.అశ్విత గోల్డ్ మెడల్ సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. అండర్-17 విభాగంలో 42 కిలోల కేటగిరీలో 10వ తరగతి విద్యార్థిని చౌల్ల హర్షిత, 72 కిలోల విభాగంలో 10వ తరగతి విద్యార్థిని కె.శ్రీవల్లి గోల్డ్ మెడల్స్ సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. అదేవిధంగా 35 కిలోల విభాగంలో 6వ తరగతి విద్యార్థిని ఎన్.నిత్య ప్రసన్న కాంస్య పతకం, 45 కిలోల విభాగంలో 7వ తరగతి విద్యార్థిని బి.రమాదేవి, 38 కిలోల విభాగంలో 9వ తరగతి విద్యార్థి జి. అజయ్ రజత పతకాలు సాధించారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.ఉమాదేవి అభినందించారు. ఏఎంసీ చైర్మన్ చిలకమ్మ, ఉపసర్పంచ్ గట్టు సంతోష్, వార్డు సభ్యుడు దాగం పాపయ్య, సీనియర్ నాయకుడు మారిశెట్టి శ్రీనివాస్, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు.

# వయోవృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట





## జిల్లా కలెక్టర్ రాజర్షిషా

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** వయోవృద్ధుల సంక్షేమం, భద్రతకు జిల్లా యంత్రాంగం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా స్పష్టం చేశారు. గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వృద్ధుల కోసం ప్రత్యేకంగా వృద్ధాశ్రమం, ప్రణాం డే కేర్ సెంటర్లను ఏర్పాటు చేసి విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. వారికి వైద్య శిబిరాలు, కంటి పరీక్షలు, ప్రభుత్వ పరంగా అందాల్సిన పుస్తకాలు, సంక్షేమ ఫలాలను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు ఎవరైనా సరే తమ తల్లి దండ్రులను, వయోవృద్ధులను సరిగా చూసుకోకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బాధ్యత విస్మరించి వృద్ధులను నిర్లక్ష్యం చేస్తే, వారి జీతం నుంచి ఆటోమేటిక్గా కోత విధించి నేరుగా వృద్ధులకు అందించేలా చట్టపరమైన నిర్ణయం తీసుకున్నామని, ఇది ఇప్పటికే అసెంబ్లీలో ఆమోదం పొంది అమల్లోకి వచ్చిందని తెలిపారు. అదేవిధంగా గతంలో భావోద్వేగంతో పిల్లలకు రాసిచ్చిన భూములను.. ఆ తర్వాత వారు సరిగ్గా చూసుకోకపోతే తిరిగి వెనక్కి పొందేలా చట్టంలో వెసులుబాటు ఉందన్నారు. ఇలాంటి సమస్యలు ఎదురైతే వయోవృద్ధులు నేరుగా తనకు దరఖాస్తు చేసుకోవచ్చని, వెంటనే స్పందించి న్యాయం చేస్తామని భరోసానిచ్చారు. జపాన్ తరహాలో రాబోయే రోజుల్లో మన దేశంలోనూ వయోవృద్ధుల సంఖ్య పెరుగుతుందని, ఆ సమాజానికి తగినట్లుగా వారి ఆరోగ్యం, డే కేర్ కార్యకలాపాలు, రక్షణ బాధ్యతలను ప్రతిఒక్కరూ విస్మరించకుండా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం పలువురు వయోవృద్ధులను కలెక్టర్ శాలువాతో సత్కరించి, మోమంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, ఎస్సీ కార్పొరేషన్ ఈడి మనోహర్, వయోవృద్ధుల సమైక్య ప్రతినిధులు దేవిదాస్ దేశ్పాండే, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, వయోవృద్ధులు, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# అసైన్డ్, భూధాన్ లపై భూదందా..!

- భూదాన్ భూముల క్రయవిక్రయాలపై ఆరోపణలు
- ఎఫ్టీఎల్ పరిధిలో అక్రమ గెస్ట్హౌస్ల నిర్మాణం
- కోడిపాక, ఎల్లమ్మగూడ అక్రమ వ్యవహారాలపై సమగ్ర విచారణకు డిమాండ్





**ఉద్యమ కెరటం, హత్నూర:** సంగారెడ్డి జిల్లా హత్నూర మండల పరిధిలో అసైన్డ్, భూదాన్ భూముల క్రయవిక్రయాలు జోరుగా సాగుతున్నాయంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు. కోడిపాక, ఎల్లమ్మగూడ, వడ్డేపల్లి, కాసాల, హత్నూర, గోవింద్రాజుపల్లి, నాగుల్ దేవులపల్లి తదితర ప్రాంతాల్లో విలువైన భూములు చేతులు మారుతున్నాయని పేర్కొంటున్నారు. గత ప్రభుత్వాల హయాంలో నిరుపేదలకు, భూమిలేని కుటుంబాలకు కేటాయించిన అసైన్డ్ భూములు, భూదాన్ భూములను నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అమాయక భూ యజమానులను మాయమాటలతో ఒప్పించి వారి వద్ద నుంచి తక్కువ ధరలకు భూములు కొనుగోలు చేసిన అనంతరం అధిక ధరలకు ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తులకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు మండల పరిధిలోని కొన్ని కుంటలు, నీటి వనరుల ప్రాంతాలను పూడ్చివేస్తూ వాటి ఆనవాళ్లు లేకుండా చేస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఎఫ్టీఎల్ పరిధిలోని భూములను ఆక్రమించుకొని నిబంధనలకు విరుద్ధంగా గెస్ట్హౌస్లు నిర్మించుకున్నారనే ఆరోపణలు స్థానికుల నుంచి వెల్లువెత్తుతున్నాయి. అసైన్డ్, భూదాన్ భూముల క్రయవిక్రయాలపై నిబంధనలు ఉన్నప్పటికీ వాటి అమలుపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడిందని స్థానికులు విమర్శిస్తున్నారు. పెద్ద మొత్తంలో భూముల లావాదేవీలు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నప్పటికీ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో కోడిపాక, ఎల్లమ్మగూడతో పాటు హత్నూర మండల పరిధిలోని అసైన్డ్, భూదాన్, ఎఫ్టీఎల్ భూములపై సమగ్ర విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా క్రయ విక్రయాలు, ఆక్రమణలు, నిర్మాణాలు జరిగినట్లు విచారణలో తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

# తెలంగాణ రక్షణ సేనలోకి సయ్యద్ సాదిక్

- 50 మంది అనుచరులతో పార్టీలో చేరిక
- కవిత సమక్షంలో పార్టీ కండువా కప్పి ఆహ్వానం



**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** గంభీరావుపేట పట్టణానికి చెందిన ప్రముఖ రాష్ట్ర నాయకుడు సయ్యద్ సాదిక్ తన అనుచరులతో కలిసి గురువారం తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీలో చేరారు. జిల్లా అధ్యక్షురాలు సుమలత శర్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టీఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత సమక్షంలో సయ్యద్ సాదిక్తో పాటు సుమారు 50 మంది అనుచరులు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కవిత వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. సయ్యద్ సాదిక్ గతంలో సుమారు 23 సంవత్సరాల పాటు బీఆర్ఎస్ పార్టీలో పనిచేసి, బీఆర్ఎస్ వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా క్రియాశీలకంగా వ్యవహరించారు. విద్యార్థి, యువజన రాజకీయాల్లో పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడంలో ఆయన కీలకంగా పనిచేశారని ఆయన అనుచరులు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలకు ముందు అధికార కాంగ్రెస్ పార్టీలో చేరినప్పటికీ, ఆ తర్వాత రాజకీయంగా క్రియాశీలకంగా కొనసాగలేదని సాదిక్ తెలిపారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో కవిత పిలుపు, పార్టీ విధానాలు, తెలంగాణ ప్రయోజనాల కోసం ఆమె చేస్తున్న కార్యక్రమాలకు ఆకర్షితుడై తెలంగాణ రక్షణ సేనలో చేరినట్లు పేర్కొన్నారు. తనతో పాటు గంభీరావుపేటకు చెందిన పెద్ద సంఖ్యలో అనుచరులు టీఆర్ఎస్ లో చేరడం పట్ల సయ్యద్ సాదిక్ హర్షం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం తనవంతు పాత్ర పోషిస్తానని తెలిపారు. సయ్యద్ సాదిక్తో పాటు పార్టీలో చేరిన వారిలో అస్లాం ఖాన్, సమిఉద్దీన్, మక్బూల్ ఖాన్, ఏజాజ్, అరఫత్, సుఫియాన్, రాజు, విట్టల్, శంకర్, నారాయణ తదితరులు ఉన్నారు. ఈ చేరికతో గంభీరావుపేట పట్టణంలో తెలంగాణ రక్షణ సేనకు కొత్త ఉత్సాహం ఏర్పడిందని పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కూర సురేష్, నాయకులు, కార్యకర్తలు, సాదిక్ అనుచరులు పాల్గొని నూతనంగా పార్టీలో చేరిన వారికి అభినందనలు తెలిపారు.

# ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అక్రమాల ఆరోపణలు

- ఓటు వేసిన వారికే ఇళ్లు ఇస్తున్నారంటూ గ్రామస్తుల ఆవేదన



**ఉద్యమ కెరటం, జైనూర్:** మండలంలోని అందుగూడ గ్రామ పంచాయతీలో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో తమకు అన్యాయం జరుగుతోందని పలువురు పేద కుటుంబాలు ఆరోపించారు. అర్హులైన పేదలకు కాకుండా సర్పంచ్కు అనుకూలంగా ఉన్నవారికి, ఓటు వేసిన వారికి ఇళ్లు కేటాయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం ఎంపీడీఓ కార్యాలయాన్ని ఆశ్రయించి తమకు న్యాయం చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. గ్రామంలో సుమారు 10 ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనప్పటికీ, పైస్థాయి నుంచి వచ్చిన లబ్ధిదారుల పేర్లను పరిగణనలోకి తీసుకోకుండా సర్పంచ్కు అనుకూలంగా ఉన్నవారి పేర్లను జాబితాలో చేర్చి ఇళ్లు కేటాయిస్తున్నారని ఆరోపించారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో రూ.5వేల వరకు లంచం తీసుకుంటున్నారంటూ ఆరోపణలు చేశారు. అయితే తాము ఎలాంటి డబ్బులు తీసుకోవడం లేదని గ్రామ పంచాయతీ చెబుతోందని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. గ్రామానికి చెందిన పవార్ వనజాకు ఇందిరమ్మ ఇల్లు మంజూరై మూడేళ్లు అవుతున్నప్పటికీ ఇప్పటివరకు ఇల్లు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇల్లు వచ్చిందని చెప్పి సర్పంచ్ సాయంత్రం వచ్చి ఫొటోలు తీసుకున్నారని, కానీ మూడేళ్లు గడిచినా ఇల్లు మాత్రం అందలేదని తెలిపారు. అధికారులు స్పందించి తనకు మంజూరైన ఇంటిని అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక, అర్హతలు, మంజూరు ప్రక్రియ, ఇళ్ల నిర్మాణ పరిస్థితులపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి అర్హులైన పేదలకు న్యాయం చేయాలని గ్రామస్తులు కోరారు. అక్రమాలు జరిగినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం సమర్పించిన వారిలో ఆడే నూర్సింగ్, పవార్ వనజా, పవార్ రవీందర్, జాదవ్ జనార్ధన్, రాథోడ్ జైపాల్, జాదవ్ తులసిబాయి, చవాన్ దిలీప్ తదితరులు ఉన్నారు.

# ఋషి పంచమి వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు



**ఉద్యమ కెరటం, నేరడిగొండ(బజార్హత్నూర్):** బజార్హత్నూర్ మండలంలోని మంజీరమ్ తాండ గ్రామంలో మథుర సమాజ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఋషి పంచమి వేడుకల్లో తెలంగాణ రక్షణ సేన పార్టీ జిల్లా అధ్యక్షుడు, బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు పాల్గొన్నారు. ప్రతి ఏడాది సాంప్రదాయ బద్ధంగా నిర్వహించే ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాథోడ్ బాపురావు మాట్లాడుతూ మంజీరమ్ తాండలో ప్రతి సంవత్సరం మథుర సమాజ్ సభ్యులు ఐక్యతతో ఋషి పంచమి వేడుకలను నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. అలాగే జ్వాలాముఖి దేవి ఆలయ అభివృద్ధికి రూ.1లక్ష విరాళంగా అందిస్తానని హామీ ఇచ్చారు. సాంప్రదాయాలు, ఆచారాలను కొనసాగిస్తూ సమాజంలో ఐక్యతను పెంపొందించే కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఋషి పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామంలో జ్వాలాముఖి దేవి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. పండుగ సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో ధ్రయవ్ సింగ్ మహారాజ్, తెలంగాణ రక్షణ సేన పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు, మథుర సమాజ్ ప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# పీచర పాఠశాలలో యూనిఫామ్, బెల్టుల పంపిణీ



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** మండలంలోని పీచర గ్రామంలో గల టిడబ్ల్యూపిఎస్ ప్రభుత్వ పాఠశాలలో గురువారం విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్, బెల్టుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పీచర గ్రామ సర్పంచ్ బైరి లింగవ్వ రాజేందర్ హాజరై విద్యార్థులకు యూనిఫామ్, బెల్టులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులందరూ చక్కగా చదువుకోవాలని, పాఠశాల అభివృద్ధికి తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# సిరిసిల్లలో కాంగ్రెస్ శ్రేణుల జోష్

## సీఎం పాదయాత్రకు మైనారిటీ కార్యకర్తల భారీ మద్దతు



**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** సిరిసిల్లలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహించిన పాదయాత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ఉత్సాహంగా పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ మైనారిటీ నాయకులు, కార్యకర్తలకు గంభీరావుపేట కాంగ్రెస్ మైనారిటీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్ హాష్మి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు గంభీరావుపేట నుంచి పెద్ద సంఖ్యలో మైనారిటీ నాయకులు, కార్యకర్తలు సిరిసిల్లకు తరలివచ్చి సీఎం పాదయాత్రలో పాల్గొన్నారని తెలిపారు. కార్యకర్తల నినాదాలు, ఉత్సాహం, సమిష్టి భాగస్వామ్యంతో సిరిసిల్లలో కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త జోష్ కనిపించిందన్నారు. పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయడంలో మైనారిటీ కార్యకర్తలు చూపించిన చొరవ, క్రమశిక్షణ, ఐక్యత అభినందనీయమని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ శ్రేణులు సమిష్టిగా ముందుకు సాగాలని కోరారు.

# గురువుల ఆశీస్సులతోనే ఉన్నత శిఖరాలకు

## మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** గురువుల ఆశీస్సులతోనే తాను స్థాయికి చేరానని ఆదిలాబాద్ మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్ అన్నారు. మహాత్మా జ్యోతిబాపూలే బాలికల కాలేజీలో గురువారం నిర్వహించిన ఫ్రెషర్స్ పార్టీకి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థినులను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో రాణించి, జీవితంలో మంచి లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. ఒకప్పుడు తనకు లెక్చరర్గా ఉన్న ప్రిన్సిపాల్ కాలేజీకే తాను ముఖ్య అతిథిగా రావడం ఎంతో గర్వంగా ఉందన్నారు. తన విద్యార్థి దశ జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. మనల్ని మంచి మార్గంలో నడిపించే గురువులను ఎల్లప్పుడూ గౌరవించాలని సూచించారు.

# నేడు సిరికొండలో గాంధీ జయంతి వేడుకలు, గ్రామసభ



**ఉద్యమ కెరటం, సిరికొండ:** జాతిపిత మహాత్మా గాంధీజీ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం ఉదయం 9.30 గంటలకు మండల కేంద్రంలోని గాంధీచౌక్లో సిరికొండ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నివాళులర్పించనున్నట్లు సర్పంచ్ బొడ్డు దత్తాత్రి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గాంధీ జయంతి వేడుకల అనంతరం గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికలో భాగంగా వీఎస్జీఆర్ఏఎంజీలో భాగమైన వీజీపీపీ గ్రామసభను నిర్వహించనున్నట్లు తెలిపారు. 2026–27 ఆర్థిక సంవత్సరానికి గ్రామంలో చేపట్టాల్సిన మౌళిక సదుపాయాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి సంబంధించి గ్రామస్తుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించనున్నట్లు వివరించారు. గ్రామ ప్రగతికి సంబంధించిన ఈ గ్రామసభకు గ్రామపంచాయతీ పాలకవర్గం, ఉప సర్పంచ్ తోకల రాజు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో హాజరై సలహాలు, సూచనలు అందించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# సీఎం సభ విజయవంతంలో కాంగ్రెస్ శ్రేణుల పాత్ర



**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి బహిరంగ సభను విజయవంతం చేసేందుకు గంభీరావుపేట మండలం నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులను పెద్ద సంఖ్యలో సమీకరించి సభకు తరలించడంలో కీలకంగా పనిచేసిన మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నిమ్మల తిరుపతి గౌడ్ను రాజన్న సిరిసిల్ల జిల్లా డీసీసీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ గురువారం ఘనంగా సన్మానించారు. సీఎం రేవంత్రెడ్డి బహిరంగ సభకు గంభీరావుపేట మండలం నుంచి పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ శ్రేణులను సమీకరించి సభను విజయవంతం చేయడంలో తిరుపతి గౌడ్ నాయకత్వం, సమన్వయం అభినందనీయమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయడంలో కార్యకర్తల ఐక్యత, నాయకుల సమన్వయం కీలకమని అన్నారు. సీఎం పర్యటన సందర్భంగా గంభీరావుపేట మండలం నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మండలస్థాయి నాయకులు, వివిధ విభాగాల ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిని సన్మానించిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** నేరడిగొండ మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఆంధ్రప్రభ రిపోర్టర్ శ్రీకాంత్ ను గురువారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ సభ్యులు మాట్లాడుతూ జర్నలిస్టులకు ఆరోగ్య కార్డులు, ఇండ్ల స్థలాలు కేటాయించాలని, సంఘ సంక్షేమానికి కృషి చేయాలని ఎమ్మెల్యేను కోరారు. దీనికి ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సానుకూలంగా స్పందిస్తూ, పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి తనవంతు పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో పాత్రికేయుల పాత్ర కీలకమని, ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ సమాజ అభివృద్ధికి వారు చేస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. పాత్రికేయుల సంక్షేమం, ప్రెస్ క్లబ్ అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షులు స్వామి గౌడ్, కార్యదర్శి రాథోడ్ సందీప్, శోభన్ రెడ్డి, నవీన్, ప్రమోద్, దేవేందర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# వృత్తి విభేదాలతోనే హత్య..?

## గంభీరావుపేటలో వ్యక్తి గొంతు కోసి చంపిన దుండగులు

**ఉద్యమ కెరటం, తిర్యాణి:** చాకలి పని విషయంలో నెలకొన్న విభేదాలే ఓ వ్యక్తి హత్యకు కారణమయ్యాయా అనే అనుమానాలు వ్యక్తమవు తున్నాయి. తిర్యాణి మండలం గంభీరావుపేట గ్రామానికి చెందిన రాచకొండ సత్తయ్య (50) బుధవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా గుర్తు తెలియని దుండగులు గొంతు కోసి పరారయ్యారు. తీవ్ర రక్తస్రావంతో స్థానికుల సాయంతో బయటకు వచ్చి పక్కింటి వారికి చెప్పే ప్రయత్నం చేశాడు. స్థానికులు వెంటనే ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడు. మృతుడి కుమారుడు సాయికుమార్ మాట్లాడుతూ తాము చాకలి వృత్తితో జీవనం సాగిస్తున్నామని, గ్రామంలో పని విషయంలో సమీప బంధువుల మూడు కుటుంబాలతో గొడవలు ఉన్నాయని తెలిపారు. తమ తండ్రి వారి మాట వినకపోవడంతో కక్ష పెట్టుకొని హత్య చేశారని ఆరోపించారు. ఊరి కోసం పని చేసిన తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. సంఘటనా స్థలాన్ని రెబ్బెన సర్కిల్ సీఐ సంజయ్ కుమార్, క్లూస్ టీం పరిశీలించారు. కేసు దర్యాప్తులో ఉందని, నిందితులను త్వరలో పట్టుకుంటామని సీఐ తెలిపారు.

# ఓటర్లకు ఇబ్బందులు లేకుండా ఎస్ఐఆర్ ప్రక్రియ చేపట్టాలి

- ఎన్నికల సంఘం మార్గదర్శకాలను ఖచ్చితంగా అమలు చేయాలి
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి




**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** భారత ఎన్నికల సంఘం తాజా మార్గదర్శకాలకు అనుగుణంగా ఎస్ఐఆర్-2026 ప్రక్రియను ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పారదర్శకంగా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. గురువారం ఎస్ఐఆర్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఆదిలాబాద్ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ రాజర్షిషా వీడియో కాన్ఫరెన్స్లో పాల్గొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్లను నోటీసులు స్వీకరించేందుకు, పత్రాలు సమర్పించేందుకు కార్యాలయాలకు పిలవరాదని స్పష్టం చేశారు. బీఎల్ఓలు ఓటర్ల ఇళ్లకు వెళ్లి నోటీసులు అందజేయడంతో పాటు అవసరమైన పత్రాలను ఇంటి వద్దే స్వీకరించాలని సూచించారు. సాధారణంగా విచారణ కోసం కూడా ఓటర్లను కార్యాలయాలకు పిలవద్దని, తప్పనిసరి పరిస్థితుల్లో విచారణ నిర్వహించాల్సి వస్తే ఆన్లైన్ విధానాన్ని వినియోగించాలని తెలిపారు. కొత్త ఓటరు నమోదు కోసం ఫారం-6 సమర్పించే సమయంలో డిక్లరేషన్ తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. తెలంగాణలో కొత్త ఓటర్ల నమోదు సందర్భంగా డిక్లరేషన్ తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. ఈఆర్ఓ కార్యాలయాల నోటీసు బోర్డులపై ఫారం-6, ఫారం-7కు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులు, పరిష్కరించిన దరఖాస్తుల వివరాలను ప్రదర్శించాలని ఆదేశించారు. పెండింగ్ నోటీసులపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలన్నారు ఫారం-6, పెండింగ్ నోటీసులు, ఫారం-7, ఫారం-8కు సంబంధించిన వివరాలను అన్ని స్థాయిల్లోని రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఎప్పటికప్పుడు అందించాలని తెలిపారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదును భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించాలని సూచించారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు అర్హత కలిగిన వ్యక్తులు 2023 అక్టోబర్ 31 నాటికి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉంటే అర్హులవుతారని తెలిపారు. ప్రస్తుత గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియకు 2026 నవంబర్ 1ను అర్హత తేదీగా పరిగణించాలని స్పష్టం చేశారు. గతంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరుగా నమోదైన వారు కూడా ప్రస్తుత నమోదు ప్రక్రియలో మరోసారి తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటరు నమోదుకు సమర్పించే మార్కుల మెమో జిరాక్స్ ప్రతిని గెజిటెడ్ అధికారి ద్వారా ధ్రువీకరించి సమర్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో అదనపు కలెక్టర్ ఆర్ఎస్.చిత్రు, ఆర్డీఓ జగదీశ్వర్ రావు, పర్యవేక్షకురాలు నలంద ప్రియ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఎస్సీ సెల్ నియామకాల్లో మాదిగలకు అన్యాయం



**ఉద్యమ కెరటం, తాండూర్:** కాంగ్రెస్ పార్టీ అధికారికంగా ప్రకటించిన ఎస్సీ సెల్ జిల్లా, మండల అధ్యక్షుల నియామకాల్లో ఎస్సీ మాదిగ సామాజిక వర్గానికి అన్యాయం జరిగిందని తాండూర్ మండల ఇన్చార్జ్ ఆయిళ్ల గణేష్ ఆరోపించారు. ఈ నియామకాలను ఎమ్మార్పీఎస్ తరపున ఖండిస్తున్నామని ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా, మండల స్థాయిలో ప్రకటించిన ఎస్సీ సెల్ నియామకాలను రద్దు చేసి, వెంటనే నూతన నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అర్హులైన మాదిగ సామాజిక వర్గానికి చెందిన వారికి సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన అనంతరం ఎస్సీల్లోని మాదిగలకు తగిన ప్రాధాన్యం కల్పిస్తామని చెప్పిన హామీ అమలుకు నోచుకోలేదని విమర్శించారు. తెలంగాణలో ఎస్సీ జనాభాలో మాదిగ సామాజిక వర్గానికి గణనీయమైన జనాభా ఉన్నప్పటికీ, ఎస్సీ సెల్ జిల్లా, మండల అధ్యక్షుల నియామకాల్లో తగిన ప్రాతినిధ్యం ఎందుకు కల్పించలేదని ప్రశ్నించారు. బుధవారం ప్రకటించిన జాబితాలో మాదిగ సామాజిక వర్గానికి ఎన్ని స్థానాలు కేటాయించారో కాంగ్రెస్ పార్టీ స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత నియామకాలను వెంటనే రద్దు చేసి, అర్హులైన మాదిగ నాయకులకు సముచిత స్థానాలు కల్పించాలని తెలిపారు. ఈ నియామకాలు కక్షపూరితంగా, మాదిగలను అణిచివేసే విధంగా ఉన్నాయనే భావన కలుగుతోందని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ మాదిగలకు ఎక్కడ అన్యాయం జరిగినా ఎమ్మార్పీఎస్ తరపున న్యాయం కోసం పోరాడుతామని పేర్కొన్నారు.

# ఉపాధ్యాయుడి డిప్యూటేషన్ రద్దు చేయాలి

**ఉద్యమ కెరటం, హత్నూర:** సంగారెడ్డి జిల్లా హత్నూర మండల పరిధిలోని గుండ్ల మాచునూర్ యూపీఎస్ పాఠశాల ఉపాధ్యాయుడు అజ్మత్ అలీ డిప్యూటేషన్ను రద్దు చేసి, తిరిగి స్థానిక పాఠశాలలోనే విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని గ్రామ సర్పంచ్ శ్రీహరి, ఉపసర్పంచ్ శంకర్ కోరారు. గురువారం జిల్లా విద్యాధికారి రోహిణిని కలిసి వినతిపత్రం అందజేశారు. గుండ్ల మాచునూర్ యూపీఎస్లో ఇప్పటికే విద్యార్థుల సంఖ్యకు, సబ్జెక్టులకు అనుగుణంగా సరిపడా ఉపాధ్యాయులు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని డీఈఓ దృష్టికి తీసుకెళ్లారు. ఇలాంటి పరిస్థితుల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుడిని డిప్యూటేషన్ పేరుతో ఇతర ప్రాంతానికి పంపించడంతో విద్యార్థుల చదువుపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని తెలిపారు. ఉపాధ్యాయులను తరచూ డిప్యూటేషన్పై ఇతర పాఠశాలలకు పంపిస్తే విద్యార్థుల విద్యాభ్యాసం దెబ్బతినే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అజ్మత్ అలీ డిప్యూటేషన్ను వెంటనే రద్దు చేసి, గుండ్ల మాచునూర్ పాఠశాలలోనే విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. డీఈఓను కలిసిన వారిలో వార్డు సభ్యులు జగన్ యాదవ్, సంతోష, రమేష్ తదితరులు ఉన్నారు.



# విద్యుత్ కష్టాలపై రోడ్డెక్కిన రైతన్నలు

- గంభీరావుపేట ప్రధాన రహదారిపై ధర్నా
- కాలిపోయిన మోటార్లతో నిరసన



**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** విద్యుత్ కోతలు, లోవోల్టేజ్ సమస్యలతో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తూ గంభీరావుపేట మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు గురువారం ఆందోళనకు దిగారు. మండల కేంద్రంలోని తెలంగాణ స్థూపం వద్ద కాలిపోయిన వ్యవసాయ మోటార్లను రోడ్డుపై ఉంచి ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. కామారెడ్డి–సిద్దిపేట ప్రధాన రహదారిపై సుమారు రెండు గంటల పాటు బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వ్యవసాయానికి అవసరమైన సమయంలో విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. మూడు గంటల పాటు కూడా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా కావడం లేదని ఆరోపించారు. ముఖ్యంగా లోవోల్టేజ్ కారణంగా వ్యవసాయ మోటార్లు తరచూ కాలిపోతున్నాయని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. విద్యుత్ సమస్య రోజురోజుకూ తీవ్రమవుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోటార్లు కాలిపోవడంతో అదనపు ఖర్చులు భరించాల్సి వస్తోందని, మరోవైపు సరైన విద్యుత్ అందక పంటలు దెబ్బతింటున్నాయని తెలిపారు. ప్రభుత్వం, విద్యుత్ అధికారులు వెంటనే స్పందించి సాగుకు అవసరమైన స్థాయిలో నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. రైతుల ధర్నా విషయం తెలుసుకున్న గంభీరావుపేట ఎస్సై సిహెచ్.శ్రీకాంత్ పోలీసు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టారు. అనంతరం తహశీల్దార్ మారుతి రెడ్డి, విద్యుత్ శాఖ ఏఈ ఆనంద్ కుమార్ ధర్నా స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అధికారుల హామీతో రైతులు ధర్నాను విరమించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు మద్దుల రాజిరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, రమేష్, బాబు, పొన్నాల మహేష్, మాజీ సెస్ డైరెక్టర్ కొక్కు దేవేందర్ యాదవ్, రైతులు గడ్డమీద ప్రసాద్ రెడ్డి, గంట అశోక్, కోడె రమేష్, దోమకొండ కృష్ణకాంత్ యాదవ్, మహేష్ రెడ్డి, చిలుక ప్రశాంత్, లింగారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, చిప్పల బాలయ్య, చిలుక స్వామి, దామోదర్ రెడ్డి, రాజిరెడ్డి, సంజీవరెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.



# రిమ్స్ ప్రగతికి ప్రతిఒక్కరూ బాధ్యతగా పనిచేయాలి

- విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు
- జిల్లా కలెక్టర్ రాజర్షిషా

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** రిమ్స్ ఆసుపత్రిలో వైద్య సేవలను మరింత మెరుగుపర్చడంతో పాటు నిర్వహణలో లోపాలను పూర్తిగా సరిదిద్దేందుకు ప్రతిఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గురువారం రిమ్స్ ఆడిటోరియంలో అధికారులు, ఔట్సోర్సింగ్ ఏజెన్సీలు, యూనియన్ ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సిబ్బందికి నెలవారీ వేతనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటున్నామని, వేతనాల్లో అనధికారిక కోతలు విధిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కేటాయించిన విధులను వదిలి ఇతర పనులకు వెళ్లే సిబ్బందిని ఉపేక్షించబోమన్నారు. సానిటేషన్, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ విభాగాల్లో సిబ్బంది కొరతను అధిగమించేందుకు అవసరమైన మేరకు సిబ్బందిని పెంచాలని సూచించారు. రిమ్స్‌కి అనధికారిక ప్రవేశాలను అరికట్టేందుకు గతంలో అమల్లో ఉన్న పాస్ విధానాన్ని వెంటనే పునరుద్ధరించాలని ఆదేశించారు. గర్భిణీల వెంట ఇద్దరు, ఇతర రోగుల వెంట ఒకరు, ఇద్దరు సహాయకులకు మాత్రమే అనుమతి ఉండేలా గేటు వద్దే నియంత్రణ చేపట్టాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా గుంపులుగా ఆసుపత్రిలోకి ప్రవేశించకుండా సెక్యూరిటీ సిబ్బంది కఠినంగా వ్యవహరించాలన్నారు. రిమ్స్ ప్రాంగణంలో గుట్కా నమలడం, ధూమపానం చేయడం, ప్లాస్టిక్, వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయడం వంటి చర్యలకు పాల్పడితే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధికారులు, సూపర్వైజర్లు తమ పరిధిలో నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. రిమ్స్ సాఫ్ట్వేర్ ఆధారంగా ఆన్లైన్ హాజరు నమోదు చేస్తున్నప్పటికీ, రిజిస్టర్లో ఉన్న 420 మందిలో 350 మంది మాత్రమే విధులకు హాజరవుతున్నారని పేర్కొన్నారు. మిగిలిన 70 మంది హాజరు కాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆన్లైన్ హాజరు వ్యవస్థలో ఉన్న సాంకేతిక సమస్యలను నెల రోజుల్లో పరిష్కరించాలని ఆదేశించారు. నవంబర్ నుంచి ఆన్లైన్ హాజరు ఆధారంగానే వేతనాలు విడుదల చేయనున్నట్లు స్పష్టం చేశారు. ప్రభుత్వం మంజూరు చేసిన రూ.11కోట్ల నిధులతో రిమ్స్ లిఫ్ట్లు, ట్రాన్స్ఫార్మర్ల మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయనున్నట్లు తెలిపారు. వీల్చైర్లు, హెచ్డీఎస్ నిధులతో కొనుగోలు చేసిన స్ట్రెచర్లను త్వరలో అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఆసుపత్రి వ్యర్థాలను మున్సిపల్ డంప్యార్డుకు తరలించేందుకు ప్రత్యేక ట్రాక్టర్ ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఔట్సోర్సింగ్ ఏజెన్సీలు ఉద్యోగుల ఈపీఎఫ్, ఈఎస్ఐ బకాయిలను డిసెంబర్ 3లోగా పూర్తిగా చెల్లించాలని ఆదేశించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్యులు, నర్సులు, సానిటేషన్, సెక్యూరిటీ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అంతకుముందు రిమ్స్ డైరెక్టర్ ఛాంబర్లో ఔట్సోర్సింగ్ సిబ్బంది విధుల నిర్వహణ, వేతన సమస్యలు, ఇతర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎస్.రాజేశ్వర్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డీఎంహెచ్ఓ సాధన, డీపీఓ రమేష్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, డ్రగ్ ఇన్స్పెక్టర్ శ్రీలత, ఔట్సోర్సింగ్ ఏజెన్సీల ప్రతినిధులు, యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలి

జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య





**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అధికారులను ఆదేశించారు. గురువారం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధి, పారిశుధ్య, సంక్షేమ, విద్యా కార్యక్రమాలను కమిషనర్ అన్వేష్తో కలిసి పరిశీలించారు. మార్కెట్ ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రజలు, వ్యాపారులకు ఇబ్బందులు కలగకుండా సమన్వయంతో చేపట్టాలని, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు. గోదావరి పుష్కర ఘాట్ ప్రాంతాన్ని పరిశీలించి సందర్శకులకు అవసరమైన మౌళిక సదుపాయాలు కల్పించేలా ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. ఎన్టీఆర్ నగర్లో పారిశుధ్య నిర్వహణను పరిశీలించి చెత్త సేకరణ, పరిసరాల పరిశుభ్రతను నిరంతరం పర్యవేక్షించాలని సిబ్బందికి సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు సకాలంలో అందుతున్నాయా అని తెలుసుకున్నారు. నీటి వృథాను అరికట్టి పొదుపుగా వినియోగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థుల హాజరు, విద్యా ప్రగతిని పరిశీలించారు. ఎఫ్ఆర్ఎస్ ఆధారిత హాజరును క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధతో అదనపు బోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రజలకు మెరుగైన మౌళిక సదుపాయాలు, ప్రభుత్వ సేవలు అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ రాజు, డిప్యూటీ ఈఈ, మున్సిపల్ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియలో డిజిటలైజేషన్ వేగవంతం చేయాలి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి





**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో డిజిటలైజేషన్ను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, ఎన్నికల విభాగం అధికారులతో ఎస్ఐఆర్ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. మ్యాపింగ్ కాని ఓటర్లు, అనమలీస్ జాబితాలో ఉన్న ఓటర్లకు జారీ చేసిన నోటీసులు, వారి ఇళ్లకు వెళ్లి ధ్రువపత్రాల సేకరణ, వివరాల డిజిటలైజేషన్ తదితర అంశాలను సమీక్షించారు. మ్యాపింగ్ కాని, అనమలీస్ జాబితాలోని ఓటర్ల నుంచి అవసరమైన ధ్రువపత్రాలను బూత్ స్థాయి అధికారులు వారి ఇళ్ల వద్దే సేకరించాలని సూచించారు. ఏఈఆర్ఓలు తమ పరిధిలోని బీఎల్ఓలు, సూపర్వైజర్లతో సమన్వయం చేసుకుంటూ ఎస్ఐఆర్ వివరాల డిజిటలైజేషన్ను వేగవంతం చేయాలని, నిర్ణీత గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని అన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా కొనసాగేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అధికారులతో మాట్లాడుతూ నోటీసులు జారీ చేసిన ఓటర్ల ఇళ్ల వద్ద అవసరమైన ధ్రువపత్రాల సేకరణ, డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, జిల్లా రెవెన్యూ అధికారి మోతీరామ్, మంచిర్యాల ఆర్డీఓ శ్రీనివాసరావు, ప్రత్యేక ఉపపాలన అధికారి చంద్రకళ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, ఏఈఆర్ఓలు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

# వయోవృద్ధులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య





**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** వయోవృద్ధులు తమ హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నస్పూర్లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవనంలో జిల్లా సంక్షేమ, గ్రామీణ అభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు హాజరై మాట్లాడారు. వయోవృద్ధుల అనుభవం, సలహాలు, సూచనలు సమాజానికి ఎంతో విలువైనవని తెలిపారు. తల్లిదండ్రులు తమ ఆస్తులు, భూములను పిల్లలకు బదలాయించిన అనంతరం నిర్లక్ష్యానికి గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వయోవృద్ధుల శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతతకు ప్రాధాన్యం ఇవ్వాలని, నడక, యోగా వంటి ఆరోగ్యకరమైన కార్యకలాపాలను కొనసాగించాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న చట్టాల ద్వారా వయోవృద్ధులకు రక్షణ కల్పిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో సుమారు 35,250 మంది వయోవృద్ధులు వృద్ధాప్య పింఛన్లు పొందుతున్నారని, పింఛన్లు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామ, మండల స్థాయిలో వయోవృద్ధుల హక్కులు, సంక్షేమంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు మాట్లాడుతూ వయోవృద్ధులు తమకు కల్పించిన చట్టపరమైన హక్కులపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. తల్లిదండ్రులు, వయోవృద్ధుల సంక్షేమ చట్టం–2007లోని సెక్షన్ 23 ప్రకారం, నిర్దిష్ట పరిస్థితుల్లో వయోవృద్ధులు బదలాయించిన ఆస్తిని రద్దు చేసే అధికారం ఆర్డీఓకు ఉంటుందని వివరించారు. సెక్షన్ 24 ప్రకారం వయోవృద్ధులను నిర్లక్ష్యం చేసే వారిపై చర్యలు, జరిమానా వంటి నిబంధనలు ఉన్నాయని తెలిపారు. ప్రతి మంగళవారం డేకేర్ సెంటర్లలో వయోవృద్ధులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వయోవృద్ధుల సమస్యలు, సహాయం కోసం 14567 టోల్ఫ్రీ హెల్ప్‌లైన్ను వినియోగించుకోవాలని తెలిపారు. అనంతరం వయోవృద్ధులను అధికారులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. నరేందర్ రాథోడ్, ఎస్సీ అభివృద్ధి అధికారి చాతరాజుల దుర్గాప్రసాద్, ఇతర అధికారులు, వయోవృద్ధుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# సీఎం సిరిసిల్ల పాదయాత్రకు అపూర్వ స్పందన



**ఉద్యమ కెరటం, సిరిసిల్ల:** ప్రజాపాలన–ప్రగతి బాట కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి సిరిసిల్ల పట్టణంలో నిర్వహించిన పాదయాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జి కేకే మహేందర్రెడ్డి తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చౌరస్తా నుంచి రగుడు ప్రాంతంలోని బహిరంగ సభ ప్రాంగణం వరకు సీఎం సుమారు 3 కిలో మీటర్లకు పైగా పాదయాత్ర నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో భాగస్వాములైన సిరిసిల్ల నియోజకవర్గ ప్రజలు, మహిళలు, యువత, గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. సీఎం పర్యటనకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్పందన వ్యక్తం చేయడం పట్ల ధన్యవాదాలు తెలిపారు. సీఎం పర్యటన సందర్భంగా కార్యక్రమాలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ కమిటీ నాయకులు, మండల నాయకులు, యువజన, మహిళా, మైనారిటీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు కార్యకర్తలు కృషి చేయాలని కోరారు.

# భరణిపాడు గ్రామానికి యామిని గర్వకారణం

ఉచిత ఎంబీబీఎస్ సీటుతో సత్తా.. ఘనంగా సన్మానం




**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా వేంసూరు మండలంలోని భరణిపాడు గ్రామానికి చెందిన నామా రమేష్, నాగిని దంపతుల కుమార్తె నామా యామిని జగిత్యాలలో ఎంబీబీఎస్ చదివేందుకు ఉచిత వైద్య సీటు సాధించడం గ్రామానికి గర్వకారణమని గ్రామ పెద్దలు, నాయకులు పేర్కొన్నారు. వైద్య విద్యలో సీటు సాధించేందుకు భారీగా ఖర్చవుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో మారుమూల గ్రామానికి చెందిన యామిని తన ప్రతిభతో ఉచిత ఎంబీబీఎస్ సీటు సాధించడం అభినందనీయమని కొనియాడారు. ఈ సందర్భంగా గురువారం భరణిపాడు ఎంపీపీఎస్ పాఠశాలలో గ్రామ పెద్దలు, నాయకుల ఆధ్వర్యంలో యామినిని ఘనంగా సన్మానించి అభినందించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని పేర్కొన్నారు. యామిని భవిష్యత్తులో మంచి వైద్యురాలిగా ఎదిగి గ్రామానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బూరుగు సుజ్యాన్రాజు, శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి రాజు, పాఠశాల, అంగన్వాడీ సిబ్బంది, పంచాయతీ సభ్యులు, మహిళలు, గ్రామ పెద్దలు, నాయకులు మందపాటి మహేశ్వరరెడ్డి, మందపాటి వెంకటరెడ్డి, మందపాటి వెంకటరామిరెడ్డి, మందపాటి ప్రసాదరెడ్డి, బొంతు ప్రసాద్, మందపాటి సూరిబాబు, గొర్ల వెంకటప్పారెడ్డి, మాదిరాజు మురళి, షేక్ బాలయ్య, షేక్ సలీం, తెలగారపు ప్రసాద్, సూరటి ప్రసన్న, పబ్బు శ్రీను, బోయ యేసు, సింగపోగు రాజేష్, పరసా బాలకృష్ణ, పరసా వెంకటేష్, పరసా వీరయ్య, విసంపల్లి నాగులు, జూంజునూరి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# 6న 'చలో ధనోర' ముట్టడిని జయప్రదం చేయాలి



**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** మిషన్ భగీరథ కార్మికులకు పెండింగ్ వేతనాలు, బోనస్, పేమెంట్ స్లిప్తో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 6న 'చలో ధనోర' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ తెలిపారు. ధనోరలోని కెరమెరి వాటర్ ప్లాంట్ వద్ద ముట్టడి చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. గురువారం మిషన్ భగీరథ డీఈ (కాగజ్నగర్) పృథ్వీరాజ్కు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మిషన్ భగీరథ ఏజెన్సీలకు, అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు అందించినా సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. కార్మికులకు ప్రతినెల 1వ తేదీన వేతనాలు చెల్లించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. బోనస్ చట్టం ప్రకారం ఒక నెల వేతనానికి సమానమైన బోనస్ చెల్లించాలని, పేమెంట్ స్లిప్, ఈఎస్ఐ, ఈపీఎఫ్ తదితర సౌకర్యాలు కల్పించాలని కోరారు. సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ఈనెల 6న ధనోరలోని కెరమెరి వాటర్ ప్లాంట్ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఆసిఫాబాద్ సెగ్మెంట్లోని వివిధ ఏజెన్సీల్లో పనిచేస్తున్న మిషన్ భగీరథ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి షాకీర్, వర్కింగ్ ప్రెసిడెంట్ జంషద్, మిషన్ భగీరథ కార్మికులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. PRGI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**



# రైతు బిడ్డకు అరుదైన ఘనత

**యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్లో చకినాల అంజన్నకు గోల్డ్ మెడల్**

**ఉద్యమ కెరటం, కాగజ్‌నగర్ :** కాగజ్నగర్ మండలం కొత్త సార్సాల గ్రామానికి చెందిన రైతు కుటుంబానికి చెందిన చకినాల అంజన్న అరుదైన ఘనత సాధించారు. చకినాల మల్లేష్--రాజక్క దంపతుల కుమారుడైన అంజన్న యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్లో ఎంఎస్సీ ఓసియన్ అండ్ అట్మోస్ఫేరిక్ సైన్సెస్లో ప్రతిభ కనబర్చి గోల్డ్ మెడల్ సాధించారు. అంజన్న గవర్నమెంట్ సిటీ కాలేజీలో డిగ్రీ పూర్తి చేసి, అనంతరం యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్లో ఎంఎస్సీ పూర్తి చేశారు. ప్రస్తుతం ఒడిశాలోని ఎన్ఐటీ రూర్కెలాలో తుఫానుల ముందస్తు అంచనాపై పిహెచ్డీ చేస్తున్నారు. ఆయన పరిశోధనకు ఇస్రో నుంచి నిధులు అందుతున్నాయి. తుఫానులను ముందుగానే అంచనా వేసి, వాటి ప్రభావంతో సంభవించే ప్రాణనష్టాన్ని తగ్గించడమే తన పరిశోధన ప్రధాన లక్ష్యమని అంజన్న తెలిపారు. తనకు ఈ స్థాయిలో విజయం సాధించేందుకు సహకరించిన గురువులు, ప్రొఫెసర్లు, కుటుంబ సభ్యులు, స్నేహితులకు కృతజ్ఞతలు తెలిపారు. తాను సాధించిన గోల్డ్ మెడల్ను తనకు అండగా నిలిచిన వారందరికీ అంకితం చేస్తున్నట్లు పేర్కొన్నారు. కాగజ్నగర్ మండలం నుంచి జాతీయ స్థాయిలో పరిశోధన రంగంలో ముందుకు సాగుతున్న అంజన్నను గ్రామస్థులు, విద్యావేత్తలు, ప్రజలు అభినందించారు.




# ఎన్నికల సంఘం తీరుపై సీపీఐ నిరసన

**ఈసీపై ఆరోపణలు.. జ్ఞానేశ్కుమార్ రాజీనామాకు డిమాండ్**

**ఉద్యమ కెరటం, ఖమ్మం:** ఎన్నికల సంఘం తీరును నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో గురువారం ఖమ్మం కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్కుమార్ రాజీనామా చేయాలని, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్షాపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు మాట్లాడుతూ ఎన్నికల సంఘం కుట్రలు, కుతంత్రాల కారణంగానే 2024లో బీజేపీ అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. ఎన్నికల సంఘం బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఓటర్ల జాబితా సమగ్ర సవరణ పేరుతో అర్హులైన ఓటర్లను తొలగిస్తున్నారని ఆరోపించారు. మరణించినవారి పేర్లు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైన ఓట్లను తొలగించడంపై అభ్యంతరం లేదని, అయితే అర్హులైన ఓటర్ల పేర్లను వివిధ కారణాలతో తొలగించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని అన్నారు. ఎన్నికల సంఘం స్వతంత్రతను కాపాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మోదీ పాలనలో రాజ్యాంగ వ్యవస్థలు నిర్వీర్యమవుతున్నాయని, సీబీఐ, ఈడీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను రాజకీయ అవసరాలకు వినియోగిస్తున్నారని ఆరోపించారు. దేశ రాజ్యాంగాన్ని మార్చి తమకు అనుకూలమైన విధానాలను అమలు చేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. జ్ఞానేశ్కుమార్ రాజీనామా చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం జ్ఞానేశ్కుమార్ రాజీనామా చేయాలని కోరుతూ జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డికి సీపీఐ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు, ఎస్కె జానిమియా, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, సిద్దినేని కర్ణకుమార్, మహ్మద్ సలాం, బిజి క్లెమెంట్, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, పోటు కళావతి, దొండపాటి రమేష్, తాటి వెంకటేశ్వరరావు, మిడికంటి వెంకటరెడ్డి, పగడాల మల్లేష్, రవి, మేకల శ్రీనివాసరావు, సాంబశివరెడ్డి పాల్గొన్నారు.

# రైతు కుటుంబానికి బీమా చెక్కు అందజేత



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా వేంసూరు మండల పరిధిలోని భరణిపాడు సొసైటీకి చెందిన రైతు చీపి నాగేశ్వరరావు గతంలో మృతిచెందడంతో ఆయన కుటుంబానికి గురువారం రైతు బీమా పథకం ద్వారా ఆర్థిక సహాయం అందించారు. ఈ మేరకు రైతు నాగేశ్వరరావు కుమారుడు చీపి బాలకృష్ణకు రూ.1 లక్ష విలువైన రై తుబీమా చెక్కును భరణిపాడు సొసైటీ అధ్యక్షులు కూరపాటి శ్రీనివాసరావు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుబీమా పథకం ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుందని, అనుకోని పరిస్థితుల్లో రైతు కుటుంబాలకు ఈ బీమా ఆర్థికంగా అండగా నిలుస్తుందని తెలిపారు. రైతు మరణంతో ఇబ్బందుల్లో ఉన్న కుటుంబానికి రైతుబీమా బాసటగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పర్సా ప్రసాద్రావు, వైస్ సర్పంచ్ లక్ష్మి, సొసైటీ కార్యదర్శి వీరభద్రరావు, సొసైటీ సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# టీ20ల్లో టీమిండియా నయా రికార్డు

**ప్రపంచంలోనే ఏకైక జట్టుగా ఘనత!**

**ఆసియా క్రీడల్లో శ్రీలంకను చిత్తు చేసి ఫైనల్‌కు దూసుకెళ్లిన భారత్**

**100+ పరుగుల తేడాతో అత్యధిక విజయాలు సాధించిన జట్టుగా రికార్డు సృష్టి**



**నాగోయా/హైదరాబాద్, అక్టోబర్ 1 (ఉద్యమ కెరటం):** జపాన్‌లోని ఐచి-నాగోయా వేదికగా జరుగుతున్న ఆసియా క్రీడలు (ఏషియన్ గేమ్స్) 2026 పురుషుల క్రికెట్ టోర్నీలో టీమిండియా సరికొత్త చరిత్ర సృష్టించింది. గురువారం శ్రీలంకతో జరిగిన తొలి సెమీఫైనల్ పోరులో భారత్ ఏకంగా 124 పరుగుల ఆధిపత్య తేడాతో ఘన విజయం సాధించి, పసిడి పతక పోరు (ఫైనల్)కు అర్హత సాధించింది. ఈ చారిత్రాత్మక విజయంతో పురుషుల అంతర్జాతీయ టీ20 క్రికెట్ చరిత్రలో 100 లేదా అంతకంటే ఎక్కువ పరుగుల తేడాతో అత్యధిక విజయాలు నమోదు చేసిన తొలి ప్రపంచ జట్టుగా భారత్ తన రికార్డును మరింత సుదృఢం చేసుకుంది.

**రికార్డుల మోత - కెనడాను దాటి అగ్రస్థానానికి:**

శ్రీలంకపై సాధించిన ఈ విక్టరీతో టీమిండియా టీ20ల్లో 100కు పైగా పరుగుల మార్జిన్‌తో గెలవడం ఇది 11వ సారి కావడం విశేషం. ఈ జాబితాలో ఇప్పటివరకు 10 విజయాలతో భారత్‌తో సమానంగా ఉన్న కెనడాను వెనక్కి నెట్టి టీమిండియా ఒంటరిగా అగ్రస్థానానికి చేరుకుంది. ఇక 9 విజయాలతో ఆస్ట్రియా మూడో స్థానంలో ఉంది. దీనికితోడు టీ20 టోర్నమెంట్లలో రెండు ప్రధాన (పూర్తి సభ్యత్వ) దేశాల మధ్య జరిగిన సెమీఫైనల్ లేదా ఫైనల్ మ్యాచ్‌లలో ఇది అత్యంత భారీ విజయ మార్జిన్‌గా నిలిచింది. గతంలో 2026 టీ20 ప్రపంచకప్ ఫైనల్లో న్యూజిలాండ్‌పై భారత్ సాధించిన 96 పరుగుల విజయ రికార్డును ఈ 124 పరుగుల గెలుపు దాటేసింది.

**మ్యాచ్ విశేషాలు**

టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 169 పరుగుల గౌరవప్రదమైన స్కోరు సాధించింది. అనంతరం 170 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంకకు భారత బౌలర్లు ఆరంభం నుంచే చుక్కలు చూపించారు. కరచరణాలిక వేగంతో వరుసగా వికెట్లు పడగొట్టడంతో శ్రీలంక బ్యాటర్లు ఏ దశలోనూ కోలుకోలేకపోయారు. దీంతో లంక ఇన్నింగ్స్ 9.5 ఓవర్లలో కేవలం 45 పరుగులకే కుప్పకూలింది. ఈ దెబ్బతో 124 పరుగులతో గ్రాండ్ విక్టరీ కొట్టిన భారత జట్టు ఫైనల్ చేరింది. గత ఆసియా క్రీడల్లో సాధించిన స్వర్ణ పతకాన్ని నిలబెట్టుకోవడమే లక్ష్యంగా అడుగులేస్తున్న టీమిండియా, శనివారం జరగబోయే తుది పోరులో పసిడి పతకం కోసం పోటీపడనుంది.

# డబుల్ సెంచరీల 'దాదా' రోహిత్..

**వెంటపడుతున్న గిల్!**

**వన్డేల్లో ద్విశతకాలతో చరిత్రకెక్కిన ఐదుగురు భారత బ్యాటర్లు**

**మూడు డబుల్ సెంచరీలతో ఇప్పటికీ రోహిత్ శర్మదే ప్రత్యేక రికార్డు**

**రెండో ద్విశతకంతో రోహిత్ తర్వాతి స్థానంలో శుభ్‌మన్ గిల్**

**264 పరుగులతో వన్డేల్లో అత్యధిక వ్యక్తిగత స్కోరు రికార్డు రోహిత్‌దే**

**సచిన్‌తో మొదలైన భారత '200' కథ.. గిల్‌తో మరో అధ్యాయం**



**గువాహటి, అక్టోబర్ 1 (ఉద్యమ కెరటం):** వన్డే క్రికెట్‌లో సెంచరీ చేయడమే గొప్ప ఘనత.. అలాంటిది ఒకే ఇన్నింగ్స్‌లో 200 పరుగుల మార్కును అందుకోవడమంటే అసాధారణ ప్రదర్శనే. ఒకప్పుడు అసాధ్యమనుకున్న ఈ ఘనతను పురుషుల వన్డేల్లో తొలిసారి సచిన్ టెండూల్కర్ సుసాధ్యం చేస్తే.. ఆ తర్వాత భారత బ్యాటర్లు ద్విశతకాల పరంపరను కొనసాగించారు. ఇప్పటివరకు భారత్ తరఫున సచిన్ టెండూల్కర్, వీరేంద్ర సెహ్వాగ్, రోహిత్ శర్మ, ఇషాన్ కిషన్, శుభ్‌మన్ గిల్ వన్డేల్లో డబుల్ సెంచరీలు నమోదు చేశారు.

**సచిన్‌తో మొదలు.. రోహిత్ హవా**

2010లో దక్షిణాఫ్రికాపై గ్వాలియర్‌లో సచిన్ టెండూల్కర్ అజేయంగా 200 పరుగులు చేసి పురుషుల వన్డేల్లో ద్విశతకం సాధించిన తొలి బ్యాటర్‌గా చరిత్ర సృష్టించాడు. ఏడాది తర్వాత 2011లో వెస్టిండీస్‌పై వీరేంద్ర సెహ్వాగ్ 149 బంతుల్లో 219 పరుగులు బాది అప్పటి అత్యధిక వ్యక్తిగత వన్డే స్కోరు రికార్డును తన పేరున రాసుకున్నాడు.

ఆ తర్వాత మొదలైంది రోహిత్ శర్మ 'డబుల్' దండయాత్ర. 2013లో ఆస్ట్రేలియాపై 209 పరుగులు చేసిన రోహిత్.. 2014లో శ్రీలంకపై ఏకంగా 264 పరుగులు బాదాడు. వన్డే క్రికెట్‌లో ఇప్పటికీ ఇదే అత్యధిక వ్యక్తిగత స్కోరు. 2017లో మరోసారి శ్రీలంకపైనే అజేయంగా 208 పరుగులు చేశాడు. దీంతో వన్డేల్లో మూడు ద్విశతకాలు సాధించిన ఏకైక బ్యాటర్‌గా రోహిత్ శర్మ కొనసాగుతున్నాడు. 2022లో బంగ్లాదేశ్‌పై ఇషాన్ కిషన్ 210 పరుగులతో విధ్వంసం సృష్టించాడు. కేవలం 126 బంతుల్లోనే ద్విశతకం పూర్తి చేసి అప్పట్లో అత్యంత వేగంగా వన్డే డబుల్ సెంచరీ సాధించిన బ్యాటర్‌గా రికార్డు నెలకొల్పాడు.

**ఇప్పుడు గిల్ 'డబుల్' జోరు**

2023లో న్యూజిలాండ్‌పై 208 పరుగులతో తన తొలి వన్డే ద్విశతకాన్ని నమోదు చేసిన శుభ్‌మన్ గిల్.. ఇప్పుడు వెస్టిండీస్‌పై మరోసారి 200 మార్కును దాటాడు. గువాహటిలో 406 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో 133 బంతుల్లో 26 ఫోర్లు, 8 సిక్సర్లతో అజేయంగా 223 పరుగులు చేసి భారత విజయానికి వెన్నెముకగా నిలిచాడు. దీంతో వన్డేల్లో ఒకటి కంటే ఎక్కువ ద్విశతకాలు సాధించిన భారత బ్యాటర్ల జాబితాలో రోహిత్ సరసన గిల్ చేరాడు. అయితే రోహిత్‌కు మూడు, గిల్‌కు రెండు ద్విశతకాలు ఉన్నాయి. కాబట్టి మీ కాపీలో ఉన్న 'రెండు డబుల్ సెంచరీలు సాధించిన రోహిత్ తర్వాత' అన్న వాక్యాన్ని లిలి'ఒకటి కంటే ఎక్కువ డబుల్ సెంచరీలు సాధించిన రోహిత్ తర్వాత రెండో భారత బ్యాటర్'లిలిగా మార్చడం సరైనది.

భారత ద్విశతక వీరులు: సచిన్ టెండూల్కర్-200 నాటౌట్, వీరేంద్ర సెహ్వాగ్-219, రోహిత్ శర్మ-209, 264, 208 నాటౌట్, ఇషాన్ కిషన్--210, శుభ్‌మన్ గిల్-208, 223 నాటౌట్.

# గ్రీకో రోమన్ రెజ్లింగ్ ఈవెంట్‌లో నితేశ్‌కు రజత పతకం

**నగోయా:** జపాన్‌లో జరుగుతున్న ఏషియన్ గేమ్స్ రెజ్లింగ్ పోటీల్లో ఇండియన్ రెజ్లర్ నితేశ్ సివాచ్ కు సిల్వర్ మెడల్ దక్కింది. 97 కేజీల గ్రీకో రోమన్ ఫైనల్లో ఇవాళ భారత రెజ్లర్ నితేశ్ ఓటమి పాలయ్యాడు. 0-4 పాయింట్ల తేడాతో అతను ఫైనల్లో జపాన్ ప్లేయర్ యూరి నకాజాటో చేతిలో పరాజయాన్ని చవిచూశాడు. వాస్తవానికి నితేశ్ గట్టి పోటీ ఇచ్చాడు. గ్రిప్ కోసం తీవ్రంగా ప్రయత్నించాడు. కానీ జపాన్ ప్లేయర్ ధీటుగా ఎదుర్కొన్నాడు. ఇండియన్ రెజ్లర్‌ను అటాక్ చేయకుండా అడ్డుకున్నాడు. దీంతో 0-4 తేడాతో నితేశ్ ఓడిపోయాడు. గ్రీకో రోమన్ స్టయిల్ రెజ్లింగ్‌లో గతంలో ఇండియాకు రెండు సార్లు గోల్డ్ మెడల్స్ వచ్చాయి. 1962లో జకర్తాలో జరిగిన గేమ్స్‌లో 52కేజీల విభాగంలో మాల్వా సింగ్, 97 కేజీల విభాగంలో గణపత్ అండాల్కర్ స్వర్ణ పతకాలు గెలిచారు. ఇవాళ జరిగిన ఫైనల్లో నితేశ్‌ను స్కోరింగ్ చేయకుండా జపనీస్ ప్లేయర్ నిలువరించాడు. ఫస్ట్ బౌట్‌ను 2-0 తేడాతో నకాజాటో ముగించాడు. లోకల్ ఫేవరేట్ అయిన నకాజాటో సెకండ్ బౌట్‌లో విజయవంతంగా నితేశ్‌ను నేలకూల్చాడు. దీంతో అతనికి 4-0 ఆధిక్యం లభించింది. చివరి నిమిషంలో నితేశ్ అటాక్ చేసినా.. నకాజాటో తన డిఫెన్స్ టెక్నిక్‌తో అడ్డుకున్నాడు.



ఉద్యమ కెరటం
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక





# ఐదేళ్ల ప్రేమకు హృతిక్ 'స్పెషల్ పోస్ట్'

## సబాతో బంధానికి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా ఫొటోలు పంచుకున్న బాలీవుడ్ స్టార్

## హృతిక్-సబా అనుబంధంపై మరోసారి అభిమానుల్లో ఆసక్తి

**ముంబై, అక్టోబర్ 1 (ఉద్యమ కెరటం):** బాలీవుడ్ స్టార్ హృతిక్ రోషన్, నటి-గాయని సబా ఆజాద్ తమ అనుబంధంలో ఐదేళ్ల మైలురాయిని చేరుకున్నారు. ఈ సందర్భంగా సబాతో కలిసి గడిపిన మధుర క్షణాలకు సంబంధించిన ఫొటోలను హృతిక్ సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. సరదా సెల్ఫీల నుంచి విహారయాత్రల వరకు తమ ప్రయాణంలోని ప్రత్యేక జ్ఞాపకాలను అభిమానులతో పంచుకోవడంతో ఈ పోస్టు వైరల్‌గా మారింది. ఫొటోల్లో హృతిక్, సబా సరదాగా సెల్ఫీలు దిగుతూ కనిపించగా.. సముద్రతీరంలో సూర్యాస్తమయాన్ని ఆస్వాదిస్తున్న దృశ్యాలు, రెస్టారెంట్‌లో చేతులు పట్టుకుని కూర్చున్న క్షణాలు, విమాన ప్రయాణంలో ఇద్దరూ కలిసి ఉన్న ఫొటోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. అయితే హృతిక్ పోస్టుకంటే ఆయన మాజీ భార్య సుసాన్ ఖాన్ స్పందన మరింతగా నెటిజన్ల దృష్టిని ఆకర్షించింది. "చాలా స్వీట్.. హ్యాపీ యానివర్సరీ" అంటూ ఆమె శుభాకాంక్షలు తెలిపారు. దీంతో ఆమె కామెంట్ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. హృతిక్, సుసాన్ 2000లో వివాహం చేసుకోగా.. 2014లో విడాకులు తీసుకున్నారు. విడిపోయిన తర్వాత కూడా పిల్లల విషయంలో పరస్పర సహకారంతో కొనసాగుతున్నట్లు వారు గతంలో పలు



సందర్భాల్లో బహిరంగంగా కనిపించారు. హృతిక్, సబా కొన్నేళ్లుగా కలిసి కనిపిస్తూ తమ అనుబంధాన్ని బహిరంగంగానే కొనసాగిస్తున్నారు. హృతిక్ చివరిగా అయాన్ ముఖర్జీ దర్శకత్వంలోని 'వార్ 2'లో నటించారు. ఇందులో జూనియర్ ఎన్టీఆర్, కియారా అద్వానీ కీలక పాత్రలు పోషించారు. 'క్రిష్ 4'తో హృతిక్ దర్శకుడిగా అరంగేట్రం చేయనున్నట్లు 2025లో రాకేశ్ రోషన్ అధికారికంగా ప్రకటించారు. మీ కాపీలో ఉన్న 'క్రిష్ 3' స్థానంలో 'క్రిష్ 4' అని ఉండాలి. మరోవైపు సబా ఆజాద్ నటనతోపాటు సంగీత రంగంలోనూ కొనసాగుతున్నారు. ఆమె నటించిన 'సాంగ్స్ ఆఫ్ పారడైజ్'తోపాటు ఇతర ప్రాజెక్టులు ప్రేక్షకుల ముందుకొచ్చాయి.

# 'జైలర్ 2'లో నోరా గ్లామర్ ధమాకా!

**చెన్నై, అక్టోబర్ 1 (ఉద్యమ కెరటం):** రజనీకాంత్ కథానాయకుడిగా నెల్సన్ దిలీప్‌కుమార్ తెరకెక్కిస్తున్న 'జైలర్ 2'లో గ్లామర్ హంగులు మరింత పెరగనున్నట్లు సినీవర్గాల్లో ప్రచారం జరుగుతోంది. నటి, డ్యాన్సర్ నోరా ఫతేహీతో ప్రత్యేక గీతాన్ని చిత్రీకరించినట్లు సమాచారం. తెలుగు, హిందీ చిత్రాల్లో తన డ్యాన్స్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నోరా.. ఈ పాటతో తమిళ ప్రేక్షకులనూ ఆకట్టుకునేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. తెలుగులో 'టెంపర్'లోని 'ఇట్టాగే రెచ్చిపోదాం' పాట నోరాకు మంచి గుర్తింపు తీసుకొచ్చింది. ఆ తర్వాత 'బాహుబలి', 'కిక్ 2', 'లోఫర్' తదితర చిత్రాల్లో ప్రత్యేక గీతాలతో సందడి చేసింది. హిందీలోనూ పలు హిట్ పాటలతో డ్యాన్సర్‌గా ప్రత్యేక క్రేజ్ సంపాదించుకుంది. ఇటీవల వరుణ్ తేజ్ 'మట్కా'లోనూ కీలక పాత్రలో కనిపించింది. తొలి 'జైలర్'లో తమన్నా చేసిన 'కావాలయ్యా' పాట సినిమా విడుదలకు ముందే దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఇప్పుడు రెండో భాగంలోనూ అలాంటి కమర్షియల్ ఆకర్షణ కలిగించే పాట ఉండాలనే ఉద్దేశంతో నోరాను రంగంలోకి దించినట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే నటి పూర్ణతో ఓ ప్రత్యేక గీతాన్ని తెరకెక్కించినట్లు సమాచారం ఉండగా, దానికి సంప్రదాయ శైలి ఎక్కువగా ఉండటంతో మరో గ్లామరస్ నంబర్‌ను నోరాతో రూపొందించినట్లు సినీవర్గాల కథనం. కొంతకాలంగా నోరా ప్రత్యేక గీతాల సంఖ్య తగ్గిన నేపథ్యంలో 'జైలర్ 2' ఆమెకు కీలక ప్రాజెక్టుగా మారే అవకాశం ఉంది. డ్యాన్స్, గ్లామర్‌తో తనకున్న ప్రత్యేకతను ఈ పాటలో మరోసారి చూపించినట్లు సమాచారం. అయితే పాటకు సంబంధించిన పూర్తి వివరాలు, విడుదల తేదీపై చిత్రబృందం నుంచి అధికారిక సమాచారం రావాల్సి ఉంది.









# కొత్త కోడలా.. ఇంట్లో దెయ్యమా?

## యామి గౌతమ్ 'నైయ్ నవెల్లి' ట్రైలర్ విడుదల

## నవ్విస్తూనే వెన్నులో వణుకు పుట్టిస్తున్న హారర్-కామెడీ

**ముంబై, అక్టోబర్ 1 (ఉద్యమ కెరటం):** ఇంట్లోకి కొత్త కోడలు వచ్చింది.. ఆమె అడుగుపెట్టగానే అప్పటివరకు గందరగోళంగా ఉన్న కుటుంబంలో ప్రశాంతత నెలకొంది. అంతా ఆమెను అదృష్టంగా భావిస్తుంటే.. ఒక్కరికి మాత్రం అనుమానం! కనిపిస్తున్నంత అమాయకురాలేనా?.. లేక ఆ నవ్వు వెనుక ఎవరికీ తెలియని భయంకరమైన రహస్యం ఉందా?.. ఈ ప్రశ్నలతో ఆసక్తి రేకెత్తిస్తోంది యామి గౌతమ్ ప్రధాన పాత్రలో రూపొందుతున్న 'నైయ్ నవెల్లి' ట్రైలర్. బాలాజీ మోహన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ హారర్-కామెడీ ఉత్తరప్రదేశ్‌లోని మీరట్ నేపథ్యంలో సాగనుంది. యామి గౌతమ్‌తోపాటు ఆదినాథ్ కోఠారే తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఆనంద్ ఎల్ రాయ్, హిమాన్షు శర్మ నిర్మాణంలో రూపొందుతున్న ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్‌కుమార్ సంగీతం అందిస్తున్నారు. ట్రైలర్‌లో ఓ సాధారణ కుటుంబంలోకి యామి కొత్త కోడలిగా అడుగుపెడుతుంది. అప్పటివరకు అస్తవ్యస్తంగా సాగుతున్న ఆ కుటుంబ జీవితాలు ఆమె రాకతో ఒక్కసారిగా గాడిలో పడతాయి. ఇంట్లో అందరూ ఆమెను అభిమానిస్తుండగా.. ఆదినాథ్ పోషిస్తున్న మరిది పాత్రకు మాత్రం ఆమె ప్రవర్తనపై అనుమానం మొదలవుతుంది. అక్కడి నుంచే కథ హారర్ మలుపు తీసుకుంటుంది. అందంగా, అమాయకంగా కనిపిస్తున్న ఆ కొత్త కోడలు నిజంగానే కుటుంబానికి అదృష్టాన్ని తీసుకొచ్చిందా?.. లేక ఆమె వెనుక ఏదైనా అతీంద్రియ శక్తి, అంతుచిక్కని రహస్యం దాగి ఉందా? అనే ఉత్కంఠను ట్రైలర్ కొనసాగించింది. ఓవైపు కుటుంబ సభ్యుల మధ్య సన్నివేశాలతో నవ్వులు పంచుతూనే.. మరోవైపు భయపెట్టే దృశ్యాలతో ఆసక్తిని పెంచే ప్రయత్నం చేశారు. హారర్, కామెడీ అంశాలను మేళవిస్తూ కుటుంబ కథకు మిస్టరీని జోడించడం 'నైయ్ నవెల్లి' ప్రత్యేకతగా కనిపిస్తోంది. ముఖ్యంగా యామి పాత్ర చుట్టూ అసలు రహస్యాన్ని బయటపెట్టకుండా ట్రైలర్‌ను కట్ చేయడం సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. దసరా సందర్భంగా అక్టోబర్ 16న చిత్రాన్ని థియేటర్లలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం.

# 'కన్య' కాదని పెళ్లి రద్దు..

## అదే 'ఇంప్యూర్' కథ!

**హైదరాబాద్, అక్టోబర్ 1 (ఉద్యమ కెరటం):** పెళ్లి పీటలు సిద్ధమయ్యాయి.. రెండు కుటుంబాలు కొత్త బంధానికి సిద్ధమయ్యాయి. అంతలో పెళ్లికూతురు 'కన్య' కాదనే విషయం అత్తింటివారికి తెలుస్తుంది. అంతే.. పెళ్లి రద్దవుతుంది! అక్కడి నుంచి ఆ యువతి జీవితం ఎలాంటి మలుపులు తిరిగింది?.. ఆమె గతాన్ని ప్రశ్నించే సమాజానికి ఆమె సమాధానం ఏమిటి?.. ఇలాంటి సున్నితమైన అంశాన్ని కథావస్తువుగా తీసుకుని తెరకెక్కిన చిత్రమే 'ఇంప్యూర్'. కాకినాడలో జన్మించి అమెరికాలో పెరిగిన వారాహి మల్లిపాముల ఈ చిత్రంతో నటిగా, రచయిత్రిగా, నిర్మాతగా తెలుగు చిత్ర పరిశ్రమలోకి అడుగుపెడుతున్నారు. న్యూయార్క్, లాస్ ఏంజిల్స్‌లో సాంకేతిక రంగంలో పనిచేస్తూనే రాత్రిళ్లు, వారాంతాల్లో కథపై పనిచేసినట్లు వారాహి తెలిపారు. మహిళ జీవితాన్ని ఆమె లైంగిక గతం ఆధారంగా కొలిచే సామాజిక దృక్పథాన్ని ప్రశ్నించే ప్రయత్నమే ఈ సినిమా కథలో ప్రధానంగా కనిపిస్తోంది. మహిళా ప్రాధాన్య కథతో సినిమా నిర్మించేందుకు పలువురు నిర్మాతలను సంప్రదించినా ఆశించిన స్పందన రాలేదని వారాహి చెప్పారు. దీంతో చివరకు తానే నిర్మాతగా మారాల్సి వచ్చిందన్నారు. తన సినిమా కల కోసం ఏళ్లుగా చేస్తున్న ప్రయత్నాన్ని చూసిన తల్లి అండగా నిలిచిన తీరు గురించి వారాహి భావోద్వేగంగా వివరించారు. "మా చెల్లి పెళ్లికి ఖర్చు చేసినట్లే నీకూ డబ్బులు ఇస్తాను.. వాటిని నీ సినిమా కోసం పెట్టుకో అని అమ్మ చెప్పింది. అయితే ఆ మొత్తం కూడా సరిపోలేదు. అప్పులు చేయాల్సి వచ్చింది. అమెరికా నుంచి ఇక్కడికి వచ్చి నటీనటులు, సాంకేతిక నిపుణులతో కలిసి సినిమాను పూర్తి చేశాం" అని ఆమె పేర్కొన్నారు. పెళ్లికి ముందు మహిళ వ్యక్తిగత జీవితాన్ని 'పవిత్రత' అనే కొలమానంతో చూడటం, అదే ప్రమాణాన్ని పురుషులకు వర్తింపజేయకపోవడం వంటి ప్రశ్నలను సినిమా ఏ కోణంలో చర్చిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. బోల్డ్ కథాంశంతో వస్తున్న 'ఇంప్యూర్' ప్రేక్షకుల్లో ఎలాంటి చర్చకు దారితీస్తుందో చూడాలి.



Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN**, and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. PRGI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: 9030717172, 9391127717